ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (మంగళ)
సహరి : 4.43 (బుధ)



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే!



అలంపురం ఆంధ్రజ్యోతి కార్యాలయంలో విజేతల ఎంపిక

3 ప్రధాన బహుమతులతోపాటు వంద కన్సొలేషన్ గిఫ్టులు

పాఠకులు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా' మంగళవారం జరగనుంది. తాడేపల్లిగూడెం సమీపంలోని అలంపురం, రాచర్ల రోడ్‌లోని ఆంధ్రజ్యోతి కార్యాలయం వేదికగా 'కార్ అండ్ బైక్ రేస్'లో అదృష్ట పాఠకులు ఎవరన్నది ఉదయం 11 గంటలకు తేలనుంది.

పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. అలాగే మరో 100 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2 వేలు విలువచేసే గృహోపకరణాలను అందజేయనున్నారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. జిల్లాలో వేల సంఖ్యలో ఈ కూపన్లు అందగా, వీరిలో అదృష్టవంతులు ఎవరన్నది మంగళవారం తెలుస్తుంది. విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారు.



సమయం : మంగళవారం ఉదయం 11 గంటలకు
వేదిక : అలంపురం, రాచర్ల రోడ్డులోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

సీఎం పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు : కలెక్టర్

పోలవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఈనెల 27న సీఎం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్న నేపథ్యంలో కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి సోమవారం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ ప్రాంతాన్ని, డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాపర్ డ్యాంలు, గ్యాప్ 1,2 ప్రాంతాలను, వైబ్రో కాంపాక్షన్ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్షిస్తారన్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించనున్నట్టు తెలిపారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లకు పోలీసు అధికారులు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. ప్రాజెక్టు వద్ద సీఎం పర్యటించనున్న ప్రాంతాలను ఆయన స్థానిక పోలీసు అధికారులతో, ప్రాజెక్టు భద్రతా బలగాలతో పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా సమన్వయంతో పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాములు నాయక్, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, డీఈ డి.శ్రీనివాస్, ఏలూరు,పోలవరం డీఎస్పీలు డి.శ్రావణ్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వ రరావు, ప్రాజెక్టు సీఐ విజయకుమార్, సీఐ బాలసురేష్‌బాబు, తహసీల్దారు సాయిరాజు, ఎస్ఐ పవన్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

అభివృద్ధే టార్గెట్

- కొత్త లక్ష్యాల వైపు సర్కారు అడుగులు
- ఈసారి గృహ నిర్మాణానికి ప్రాధాన్యం
- స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు మార్గదర్శకాలు
- ఉపాధి, పరిశ్రమల స్థాపనకు సరికొత్త గీటురాళ్లు
- ప్రజాభీష్టం మేరకు సీఎం దిశా నిర్దేశం
- హాజరవుతున్న కలెక్టర్, ఎస్పీ

నేటి నుంచి రెండు రోజుల పాటు కలెక్టర్ల కాన్ఫరెన్స్



(ఏలూరు- ఆంధ్రజ్యోతిప్రతినిధి) :

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వచ్చి తొమ్మిది నెలలు పైనే కావొస్తోంది. ఇంత స్వల్ప వ్యవధిలోనే అనేక సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసం స్థానంలో సరికొత్త మార్పు చూపించాల్సి వచ్చింది. మూడు నెలలు క్రితం గతేడాది డిసెంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరిగింది. తిరిగి మరోమారు నేడు, రేపు కలెక్టర్లతో సీఎం భేటీ అవుతున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకించి అనేక నిర్ణయాల అమలుకు దిశా నిర్దేశం చేయబోతున్నారు.

మూడు నెలల్లో ముందడగు

మూడు నెలలు క్రితం సీఎం చంద్రబాబు కలెక్టర్లతో ప్రత్యే కంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను, జిల్లాల వారీగా అందుకోవా ల్సిన లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో దెబ్బతిన్న రోడ్లను కేవలం 100 రోజుల వ్యవధిలో మరమ్మతు చేసే దిశగా కలెక్టర్లకు లక్ష్యాలను ముందుంచారు. జిల్లాలో దాదాపు 948 రోడ్ల మరమ్మతు పనులను అనుకున్నట్టుగానే ఫిబ్రవరి నాటికే అత్యధిక శాతం పూర్తి చేయగలిగారు. ఈసారి జరిగే కలెక్టర్ల సమావేశంలో రోడ్ల మరమ్మతులతో పాటు సిమెంటు రోడ్ల నిర్మాణానికి మరోమారు ఊతం ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికి తగ్గట్టు గానే అన్ని మునిసిపాలిటీల్లో ఎక్కడ అవసరమైతే అక్కడ సిమెంట్ రోడ్లను ప్రతిపాదించారు. స్థానికంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు వీటిని నిర్మిస్తుం డగా, అదనపు రోడ్లకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చే అవకాశం లేకపోలేదు. అలాగే భ్రష్టు పట్టిన సహకార సంఘాలను ఈ తొమ్మిది నెలలు పాలనలో గాడినపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోమారు కలెక్టర్ల సమా వేశంలోను ఈ అంశం ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ప్రతీసారి అక్రమాల ప్రస్తావనకు వస్తున్న స్టాంప్స్‌అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలోనూ మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ముందు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు అనుగుణంగా ముందస్తు స్లాట్ కేటాయిం చాలని నిర్ణయించారు. దీని అమలుపై అధికారులకు దిశా నిర్దేశం చేసే అవకాశం కనిపి స్తోంది. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ సమ కూర్చాలని భావించి ఆ దిశగా ప్రభుత్వం ముందడగు వేసింది. ఇప్పుడది తాజాగా కార్యరూపం దాలుస్తోంది. అంగన్‌వాడీల్లో చిన్నారులందరికి ఆధార్ సమకూరుస్తున్నారు. వీటితో పాటు స్థానికం గా ప్రాధాన్యతా అంశా లను ప్రత్యేకంగా చర్చించే అవకాశం కనిపిస్తోంది.

స్వచ్ఛాంధ్ర..విజన్ -2047

ఈ రెండు ప్రాధాన్యతా అంశాలపై ఇప్పటికే కలెక్టర్లు నివేదిక సిద్ధం చేశారు. ఇటీవల సీఎం ఉమ్మడి పశ్చిమలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రకు ఊత మిచ్చేలా తణుకులో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర అమలులో ఏలూరు జిల్లా రాష్ట్రంలోని అట్టడుగు మూడో స్థానంలో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. వచ్చే అక్టోబరు నాటికి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాల్సిందేనని సున్నితంగా వార్నింగ్ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర అంశంపై మరిన్ని మార్గదర్శకాలను, లక్ష్యాలను కలెక్టర్ల ముందుంచే అవకాశం ఉంది. విజన్ -2047 అమలుపై ప్రభుత్వం పట్టుదలగా ఉన్న నేపథ్యంలో ఈ సారీ కలెక్టర్లకు ఈ అంశానికి ప్రాధాన్యత ఇచ్చేలా మార్గదర్శకాలు ఇస్తారని భావిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే పీ-4 (పేదరిక నిర్మూలన)కు వీలుగా జిల్లా స్థాయిలో మరింత ప్రాధాన్యత దక్కేలా చూడబోతున్నారు.

నేడు,రేపు జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పాల్గొంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ శాఖలపై దిశా నిర్దేశం చేస్తారు. ఇప్పటికే జిల్లాలో ఆయా శాఖల పురోగతిని, మరికొన్ని ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. వీలైతే సీఎం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. గత సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఎంత మేర తాము పురోగతి సాధించిందనే విషయం సూచికల రూపంలో తెలపబోతున్నారు.

చురుగ్గా ఉపాధి.. గృహ నిర్మాణం

సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో వెళ్లాలన్న లక్ష్యంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో యువతకు ఉపాధి, పేదలకు సొంతింటి కల నెరవేరేలా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఈవై) కింద వేలాది గృహాలు నిర్మించాల్సి ఉన్నందున అనుకున్న లక్ష్యాలకు చేరుకునేలా నిర్దిష్ట ఆదేశాలను సీఎం జారీ చేస్తారని భావిస్తున్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా పరిశ్రమల స్థాపనకు అనువైన చర్యల వైపు కలెక్టర్లను పరుగులు పెట్టించవచ్చని భావిస్తున్నారు. జిల్లాలో ఆక్వారంగానికి ఊతమిచ్చేలా నూతన చర్యలు, పౌర సరఫరాలు, విద్యా రంగంలో పెనుమార్పుల దిశగాను లక్ష్యాలను నిర్దేశిస్తారని భావిస్తున్నారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌కు చెందిన సమస్యలు, తాగునీటి సమస్యలు, సచివాలయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై 26వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' నిర్వహించనుంది. ప్రజలు **94937 42399** నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కె.భీమేశ్వర్ చర్యలు తీసుకుంటారు.

రబీ ధాన్యం సేకరణకు సన్నాహాలు

- 118 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు : జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జేసీ పి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో సోమవారం రబీ ధాన్యం సేకరణపై జేసీ అధ్యక్షతన జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో రబీ పంటకు సంబంధించి 98 శాతం ఈకేవైసీ పూర్తయిందన్నారు. జిల్లాలో 3,97,807 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పాదకత అవుతుందని అంచనా వేయగా 2,25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. త్వరితగతిన రవాణా కోసం వాహనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. జిల్లాలోని 118 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, ఎంవీ రమణ, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వి.శ్రీలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా, డీసీవో ఎ.శ్రీనివాస్ తో పాటు ఇతర జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలొచ్చేస్తున్నాయ్!
ప్రభుత్వ టెక్స్ట్‌బుక్స్ తాడేపల్లిగూడెం డిపోనకు చేరిక 6

మామిడి సాగును లాభదాయకంగా మారుస్తాం

- రైతు దరి చేరని ప్రయోగ ఫలాలు
- మామిడి అభివృద్ధికి రూ.100 కోట్లతో నూజివీడుకు ప్రత్యేక క్లస్టర్
- మంత్రి పార్థసారథి




సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సమాజంతో మామిడికి అవినాభావ సంబంధం ఉందని, మామిడి తోరణాలు, మాగాయి లేని ఇల్లు తెలుగు రాష్ట్రంలో కనబడదని అలాంటి రాష్ట్రంలో మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఈ పరిస్థితుల్లో మామిడి సాగును లాభదాయకంగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అనుబంధ నూజివీడు మామిడి పరిశోధన స్థానం ఆధ్వర్యంలో సోమవారం నూజివీడులోని నాగేంద్ర కల్యాణ మండపంలో మామిడి ఎగుమతులు పెంపొందించడానికి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతు సదస్సు, వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. 'శాస్త్రవేత్తల ప్రయోగ ఫలితాలు మామిడి రైతులకు అందడం లేదు. నూజివీడు ప్రాంతంలో పండే చిన్నరసం రకం మామిడికి జియోలాజికల్ గుర్తింపు సాధించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. మామిడి అభివృద్ధికి రూ.100 కోట్లతో నూజివీడుకు ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది మామిడి సీజన్ నాటికి నూజివీడు మామిడి మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. నూజివీడు మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తాను' అన్నారు. వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కే గోపాల్ మాట్లాడుతూ పంటల రక్షణకు చిన్నచిన్న శాస్త్రీయ పద్ధతి పాటిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. నూజివీడు మామిడి పరిశోధన స్థానంలో పరిశోధనలకు ఉన్న భూమి చాలడం లేదని మరో 20 ఎకరాలు అవసరం ఉందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ మునిరెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులు పురుగుమందులపై ఆధారపడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆపేడా రీజనల్ హెడ్ ఆర్పీ నాయుడు, హార్టీకల్చర్ అధికారి గోవిందరాజులు, నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కనకమహాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. రైతు సదస్సు సందర్భంగా పలు స్టాళ్లను ఏర్పాటు చేసి పరికరాలు, పురుగు మందులు వాడకం, తదితరాలపై అవగాహన కల్పించారు.

చిన్నంపేటలో పులి సంచారం?

- భయాందోళనలో గ్రామస్థులు



పులి పాదముద్రలుగా భావిస్తున్న ఆనవాళ్లు

చాట్రాయి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలం చిన్నంపేటలో పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో రైతులు, ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. చిన్నంపేట నుంచి పోతనపల్లి వెళ్లే దారిలో గిన్నెల చెరువు వద్ద తనకు పులి కన్పించినట్టు ఓ వ్యక్తి గ్రామంలోకి వచ్చి చెప్పడంతో జనం ఉలిక్కి పడ్డారు. పులి భయంతో సోమవారం రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలలోకి వెళ్లకుండా ఇళ్ల వద్దనే ఉండిపోయారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని యువకులు బృందంగా పులి సంచరించినట్టు చెబుతున్న ప్రాంతానికి వెళ్ళి పరిశీలించగా పెద్ద పెద్ద పాదముద్రలు కన్పించాయి. అవి పులి పాదముద్రలేనని నమ్ముతున్నారు. చిన్నంపేట కో-ఆపరేటివ్ ఫారమ్ కాలనీకి చెందిన కొంతమంది యువకులు సోమవారం రాత్రి బహిర్భూమికి వెళ్లగా వారికి పులి కన్పించిందని యువకులు భయంతో గ్రామంలో పరిగెత్తుకు వచ్చి చెప్పినట్టు తెలిసింది. ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి చిన్నంపేట వెళ్ళి అక్కడ పోలీస్ నైట్‌బీట్ ఏర్పాటు చేశారు. గ్రామస్థుల నుంచి వివరాలు అడిగితెలుసు కున్నారు. అటవీశాఖ అధికారులు సిబ్బంది చిన్నంపేట వస్తున్నట్టు సమాచారం.

జిల్లాలో నేటి నుంచి రెండురోజుల పాటు వేడిగాలులు

ఏలూరుసిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 25, 26 తేదీల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 25న పోలవరంలో 39.1 డిగ్రీలు, వేలేరుపాడులో 40.1 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. 26న పోలవరంలో 39.4, వేలేరుపాడులో 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : డీఆర్వో

ఏలూరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో డీఆర్వోతో పాటు ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, దేవకీరాణి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి నాణ్యతగల ఎండార్స్‌మెంట్ అందజేయాలని అధికారులను డీఆర్వో ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఇతర అధికారులు

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త : ఎస్పీ

ఏలూరు క్రైం : ఇటీవల సైబర్ నేరగాళ్లు తెలివిగా ఢిల్లీ, కోల్‌కత్తా, మద్రాసు, చెన్నై ఇతర ప్రాంతాల నుంచి తాము ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ లేదా సీబీఐ డైరెక్టర్ల మని ఫోన్ చేసి మీరు గతంలో మీ అకౌంట్ ద్వారా మత్తుపదార్థాలను రవాణా చేశారని మీపై కేసు నమోదు చేశారని బెదిరిస్తూ కేసు ఉపసంహరించాలంటే డబ్బులను అకౌంట్‌కు పంపించాలని ఫోన్‌లు చేస్తున్నారని అటువంటి ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ సూచించారు. ఇలాంటి వారి సమాచారాన్ని 1930 తెలపాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యా లయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్ పాల్గొని 36 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఫిర్యాదుదారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది
- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం
- భార్య, ప్రియుడి అరెస్ట్
7

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం
- తొలిరోజు ధర కిలో రూ.290



ఆకివీడు బాలురున్నత పాఠశాల ఆవరణలో కోనోకార్పస్ మొక్కల మధ్య విద్యార్థులు

ఆహ్లాదం కాదు.. ఆరోగ్యానికి హానికరం

ఆకివీడు హైస్కూల్ ఆవరణ చుట్టూ ప్రమాదకర కోనోకార్పస్ మొక్కలు

ఆకివీడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. మొక్కలు పెంచండి.. పర్యావరణాన్ని రక్షించండి అని ప్రభుత్వాలు చెబుతాయి.. కానీ కొన్ని వృక్ష జాతుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అటువంటిదే కోనో కార్పస్ మొక్క.. వీటి వల్ల శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయని వైద్యులు అంటున్నారు. ఈ మొక్క నిటారుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతుండడంతో రహదారులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీటిని ఎక్కువగా నాటుతున్నారు. ఈ మొక్క వల్ల కీటకాలు, పక్షులకు ఎటువంటి ఉపయోగం లేదు. ఈ మొక్క పేరు వింటేనే పర్యావరణ ప్రేమికులు, వృక్ష శాస్త్రవేత్తలు హడలెత్తిపోతున్నారు.ఈ చెట్టు నుంచి వంచే వాసన వల్ల చర్మంపై దద్దుర్లు, అలర్జీ, ఆస్తమా సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెప్తున్నారు. కార్బన్ డయాక్సైడ్ వేగంగా విడుదల చేస్తాయని చెపుతున్నారు. ఆకివీడు జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాలలో నిమిదేళ్ల క్రితం పూర్వ విద్యార్థులు ఈ మొక్కలను సుమారు 300 నాటారు. ఈ మొక్కలు ఇప్పుడు పెద్దవయ్యాయి. ఈ మొక్కల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేయడంతో కొన్నిచోట్ల తొలగించారు. ఈ పాఠశాలలో తొలగించలేదు. పాఠశాలలో సుమారు 1400 మంద విద్యార్థులు ఉన్నారు.ఈ చెట్ల మధ్యనే రోజూ తిరుగుతుంటారు. క్రీడా ప్రాంగణం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పలువురు రోజూ వాకింగ్ చేస్తుంటారు. ఈ మొక్కల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

మొక్కలు తొలగించాలని ఎటువంటి ఆదేశాలు రాలేదు

కోనో కార్పస్ మొక్కలు తొలగించమని ఎటువంటి ఆదేశాలు రాలేదు. మొక్కలు వేసిన పూర్వ విద్యార్థుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాను. ఈ మొక్కల్లో రకాలు ఉంటాయని ఇక్కడ నాటిన మొక్కల వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తవని చెప్పారన్నారు. ఈ మొక్కలను తొలగించాలంటే లక్షలో ఖర్చుతో కూడుకున్నది. నరికితే మళ్లీ మొలకెత్తుతాయి

- తోట పోతురాజు, ప్రధానోపాధ్యాయుడు, ఆకివీడు



పట్టిసీమలో ఏటిగట్టుకి గండిపెట్టి వదిలేసిన ప్రాంతం

గోదావరి ఏటిగట్టుకి తూట్లు !

అధికారుల నిర్లక్ష్య ధోరణిపై స్థానికుల ఆవేదన

పోలవరం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి గూటాల పంచాయతీ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర ఏటిగట్టుని పలు ప్రాంతాల్లో తవ్వి వదిలేశారు. రానున్న వర్షాల సీజనులో గోదావరి నీటిమట్టం పెరిగినతే ఆయా ప్రాంతాలు ప్రమాదకరంగా మారి ఏటిగట్టుకి గండంగా పరిణమించనుంది. పోలవరం, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల పంచాయతీల పరిధిలో ఏటిగట్లకు ఇసుక ర్యాంపుల నిర్వహణ కోసం రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు గెస్టు హౌసుల నిర్వహణ కోసం వాహనాలు ఆయా ప్రాంతాలకు రాకపోకల కోసం పలుచోట్ల ఏటిగట్టుని యథేచ్ఛగా తవ్వి ర్యాంపులు ఏర్పాటు చేశారు. పోలవరం పంచాయతీ కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పట్టిసీమ గ్రామాల గోదావరి లంక భూముల్లో రెస్టారెంట్లు, అతిథి గృహాలు, ఫంక్షన్ హాళ్ల నిర్వహణ కోసం రహదారి నుంచి లంక భూములలోకి రాకపోకల కోసం పలుచోట్ల ఏటిగట్టుని తవ్వి మార్గాలు చేశారు. పట్టిసీమ గ్రామ శివారున శ్మశాన భూముల వద్ద, కొవ్వాడ కాల్వ అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద ఇటీవల పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల ర్యాంపులు, పార్కింగ్ అవసరాల కోసం నాలుగు ప్రాంతాల్లో యంత్రాలతో తవ్విన ఏటిగట్లను పూడ్చకుండా వదిలేశారు. పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల , మహాలక్ష్మీదేవిపేట ప్రాంతాల్లో ఇసుక ర్యాంపుల కోసం గతంలో తవ్విన ఏటిగట్ల గండ్లు, తాజాగా ఇటీవల చేసిన గండ్లు పూడ్చకుండా వదిలేశారు. గట్టు పరిరక్షణ బాధ్యతలు పర్యవేక్షించాల్సిన అఖండ గోదావరి రివర్ బండ్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వల్ల వర్షాల సీజనులో ఆయా ప్రాంతాల్లో వరద ముంపు భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు ఇసుక, బస్తాలు, కర్రలు, తడికలు వేసి అదనపు వ్యయంతో రక్షణ చర్యలు చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏటా ఇదే తీరు కొనసాగుతుండడం వల్ల రక్షణ చర్యల కోసం ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతోందని, అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పోలవరం నిర్వాసితులు, సీపీఎం నాయకులు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల గ్రామాలను కాంటూరులో చేర్చాలి

ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వాసితుల ధర్నా

ఏలూరురూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నేటికీ ఒక్కో కుటుంబానికి రూ.10 నుంచి 12 లక్షలు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఆరు లక్షల రూపాయలు ఇచ్చి కేంద్ర, రాష్ట్రాలు చేతులు దులుపుకున్నాయని, ఈ పరిహారం డబ్బుతో పునరావాస గ్రామాలకు వెళ్లి జీవనం గడిపే పరిస్థితిలేదని పూర్తి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (ఎంఎల్) ప్రజా పంథా ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వ హించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 45-72 కాంటూరులో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉన్న గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి ఆర్‌ఆర్ ఇవ్వాలని కోరారు. ఆర్‌ఆర్ పునరావాస కేంద్రాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో ఆర్‌ఆర్ కాలనీల్లో స్మశాన వాటికల భూములను రాజకీయ పెద్దలు, దళారులు ఆక్రమించారని, ఆ భూముల ఆక్రమణలు తొలగించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో పరిశ్రమలు స్థాపించి నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ప్రజా పంథా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ టెన్షన్

మునిసిపాలిటీ పనులపై విచారణ

ఐదేళ్ల పాత రికార్డులను సిద్ధం చేయండంటూ వర్తమానం

నరసాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వ హయాంలో మునిసిపాల్టీలో చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణకు రెడీ అయింది. 2019 నుంచి 2024 వరకు పురపాలక సంఘంలో చేపట్టిన పనులు, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటరీ విభాగాలకు సంబంధించి రికార్డులను సిద్ధం చేయాలని విజిలెన్స్ ఎస్పీ శ్రీరాంబాబు పేరిట మునిసిపాల్టీకి వర్తమానం పంపారు. దీంతో అధికారుల్లో టెన్షన్ మొదలైంది. విజిలెన్స్ ఆదేశాలతో అధికారులు పలు రికార్డులను బయటకు తీశారు. ఎస్పీ ఆదేశాలకు అనుగుణంగా గతంలో ఇక్కడ పని చేసి బదిలీ అయిన సిబ్బందికి కూడా విచారణ సమయంలో రావాలంటూ వర్తమానం పంపారు.

గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. ప్రధానంగా అప్పటి సీఎం జగన్ నరసాపురం విచ్చేస్తున్న సమయంలో హడావుడిగా చేసిన పనుల్లో పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.వీటిలో ఇంజనీరింగ్ పర్యవేక్షణలో జరిగిన డంపింగ్ యార్డు, కార్యాలయ సమీపంలో నిర్మించిన ఆడిటోరియం వంటి పనులు ఉన్నాయి. వీటినే విజిలెన్స్ పంపిన వర్తమానంలో ప్రస్తావించింది. ఇక టౌన్‌ప్లానింగ్, శానిటరీ, రెవెన్యూ విభాగాలను కూడా రికార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నరసాపురం పట్టణంలో చేపట్టిన కొన్ని నిర్మాణాలపై గతంలో విజిలెన్స్ తనిఖీ చేసింది. నిబంధనలను అతిక్రమించి పెద్ద పెద్ద భవనాలను నిర్మించారు. కనీసం సెట్ బ్యాక్ కూడా విడిచి పెట్టలేదు. చిన్న చిన్న వీధుల్లో కూడా మూడు నాలుగు అంతస్థులు



నిర్మించారు. వీటికి అనుమతులు ఎలా ఇచ్చారన్నది అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఇప్పుడు విజిలెన్స్ వీటిని తనిఖీ చేసేందుకు వస్తుండటంతో గతంలో పని చేసిన సిబ్బందిలో గుబులు మొదలైంది. ఇక పారిశుధ్యం నిర్వహణ, తాత్కాలిక పద్ధతిలో పని చేసే సిబ్బంది హాజరు, రెవెన్యూలో ఇంటి పన్నులు అమల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నాయన్న ఆరోపణలు మునిసిపాల్టీలో లేకపోలేదు. ఇప్పుడు విజిలెన్స్ వీటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసేందుకు వస్తున్నామని సమాచారం ఇవ్వడంతో ఆయా శాఖల అధికారులు వాటిని బయటకు తీసి సిద్ధ చేస్తున్నారు. దీనిపై కమిషనర్ ఆంజయ్యను వివరణ కోరగా " తనిఖీలకు వస్తున్నట్లు విజిలెన్స్ ఎస్పీ సమాచారం పంపిన విషయం వాస్తమన్నారు. షెడ్యూల్ ప్రకారం శనివారం రావాల్సి ఉంది. అయితే ఆ రోజున వాయిదా పడింది. సోమవారం మళ్లీ మాకు సమాచారం వచ్చింది. మంగళవారం వస్తున్నట్లు. వారు చెప్పిన రికార్డులన్నీ సిద్ధం చేసి ఉంచాం" అని వివరించారు.

పాఠ్య పుస్తకాలొచ్చేస్తున్నాయ్ !

తాడేపల్లిగూడెం ప్రభుత్వ టెక్స్‌బుక్స్ డిపోనకు చేరిక

విద్యార్థుల వీపులపై పుస్తకాల సంచీ భారం తగ్గించే చర్యలు

ఏలూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సరానికి (2025-26) పాఠ్య పుస్తకాలు సిద్ధమయ్యాయి. కొన్నిరోజులుగా టెక్స్ బుక్స్ పంపిణీ తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ డిపో గోడౌన్‌కు వాహనాల్లో చేర్చే పనులు జరుగుతున్నాయి. పుస్తకాల పంపిణీలో ప్రభుత్వం ఈ ఏడాది పాత జిల్లాలనే ప్రాతిపదికగా తీసుకుంటోంది. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని 48 మండలాల పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతివరకు చదివే బాలబాలికలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను తాడేపల్లిగూడెం డిపో నుంచే తరలించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బాలబాలికల సంఖ్యను పాఠశాల విద్యాశాఖ వద్దవున్న యూ-డైస్ డేటా ఆధారంగా త్వరలో నిర్ధారించి, ఆ మేరకు పుస్తకాలను మండలాల వారీగా ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో స్కూల్ పాయింట్లకు మే మొదటి వారంలో పంపిణీ చేస్తారు. ప్రస్తుతం జరుగుతోన్న ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ఏర్పడనున్న ఐదురకాల బడులపై మండలాల వారీగా స్పష్టత వచ్చిన వెంటనే విద్యార్థుల సంఖ్యపై ఓ అంచనాకు పాఠశాలల వారీగా వచ్చిన అనంతరం స్కూల్ పాయింట్లకు చేరవేత ఉంటుందని సమాచారం. ప్రస్తుతానికి గతేడాది యూ-డైస్ డేటాప్రకారం ఉమ్మడి జిల్లాకు మొత్తం 4,45,751 పాఠ్యపుస్తకాలు అవసరమవుతాయని అంచనా కాగా, ఇందులో సోమవారం నాటికి 2,09,452 పుస్తకాలను తాడేపల్లిగూడెం డిపోనకు తరలించారు. ప్రభుత్వం నుంచి మండలాల వారీగా ఇండెంట్ అందినవెంటనే పుస్తకాలను పంపిణీచేసే కార్యకలాపాలను ప్రారంభిస్తామని తాడేపల్లిగూడెం గవర్నమెంట్ టెక్స్‌బుక్స్ డిపో మేనేజర్ భాస్కర్ వెల్లడించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభయ్యే నాటికి అన్ని స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులందరికీ ఒకేసారి పంపిణీ చేసేందుకువీలుగా సిద్ధంగా ఉంచడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేస్తోంది.



రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ఫొటోలు లేకుండానే..

గత వైసీపీ ప్రభుత్వకాలంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు మొదలుకుని వీధుల్లో చెత్తను సేకరించే వాహనాలవరకు పార్టీ రంగులు, మాజీ సీఎం జగన్ ఫొటోలతో రాజకీయ మయం చేసిన విషయం విధితమే. అప్పటి ప్రభుత్వ రంగులపిచ్చిని న్యాయస్థానాలు సైతం పలు సందర్భాల్లో తప్పుబట్టినప్పటికీ, చివరికి పాఠ్యపుస్తకాలను సైతం అప్పటి ప్రభుత్వం వదల్లేదు. దీనికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం పాఠ్యపుస్తకాలపైన, పాఠ్యాంశాలపైన ఎక్కడా రాజకీయాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంది. త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాల అట్టలపైన, లోపలి పేజీల్లో సీఎం సహా, ఇతర రాజకీయనాయకుల, పాఠశాల విద్య డైరెక్టర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, తదితర ఉన్నతాధికారుల ఫొటోలు గాని లేకుండా ఉండటం పాఠశాలల్లో సహృద్భావ విద్యా వాతావరణానికి సంకేతమని చెప్పవచ్చు.

ప్యాట్రన్ మారిందిలా

జగన్ ప్రభుత్వ పాలనలో జరిగిన విద్యా విధ్వంసాన్ని చక్కదిద్దేలా ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన పలు చర్యల్లో భాగంగానే వచ్చే విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాల ప్యాట్రన్‌లో కూడా మార్పులు చేపట్టారు. ఆ ప్రకారం పలు తరగతులకు టెక్స్ బుక్స్‌ను మార్చారు. నూతన విధానం ప్రకారం ఒకటోతరగతి నుంచి ఐదో తరగతి వరకు లాంగ్వేజెస్, నాన్-లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో పాఠ్యపుస్తకాలను, వర్క్‌బుక్‌లను రెండు సెమిస్టర్లుగా విభజించి ముద్రించారు. ఈ తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులను కలిపి ఒక పాఠ్యపుస్తకం, వర్క్ బుక్‌లను రెండు సెమ్‌లుగా ముద్రించి, ఆరు నెలలకు ఒకటి చొప్పున పంపిణీ చేస్తారు. ఇక 6,7,8,9 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులను కలిపి టెక్స్‌బుక్స్ రెండుసెమిస్టర్లలో, మిగతా నాన్-లాంగ్వేజి సబ్జెక్టులకు వేర్వేరుగా రెండు సెమిస్టర్లలో పుస్తకాలను అందజేస్తారు. ఇప్పటివరకు సోషల్‌స్టడీస్‌లో వేర్వేరుగా ముద్రించి పంపిణీ చేసిన జాగ్రఫీ, హిస్టరీ, పొలిటికల్ సైన్సు సబ్జెక్టులను ఒకే పాఠ్య పుస్తకంగా పంపిణీ చేయనున్నారు. పదో తరగతిలో హిందీ సిలబస్‌ను మార్చగా, గణితం సబ్జెక్టు మాత్రం రెండుసెమిస్టర్లుగా ముద్రించి విద్యార్థులకు అందజేయనున్నారు. కొత్తగా అమలు చేయనున్న విధానంలో విద్యార్థుల వీపులపై పుస్తకాల సంచీ భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.



డీఎన్నార్‌లో వికసిత భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

దేశాభివృద్ధికి 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' చాలా కీలకం

భీమవరం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకై వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రధాన నరేంద్ర మోదీ ముందుకు వెళ్తున్నారని 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనేది దేశాభివృద్ధికి ఎంతో కీలకమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల ప్లాటినం జూబ్లీ సెమినార్ హాల్‌లో సోమవారం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్- 2025 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ అధ్యక్షతన నిర్వహించారు. మంత్రి వర్మ మాట్లాడుతూ దేశంలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ గోపీమూర్తిలు మాట్లాడుతూ వికసిత్ యూత్ పార్లమెంట్ ద్వారా యువత ముందుకు వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని, ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంపై ప్రతి ఒక్కరూ తమ వైఖరి వెల్లడించాలన్నారు. కళాశాల పాలక వర్గ అధ్య క్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు, సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాండురంగరాజు, వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ప్రత్యేక అధికారి డివైవో డి.కిషోర్, జిల్లా యువజన సర్వీసులు సీఈవో ప్రభాకర్, నన్నయ్య యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల కొండ దిగువ లింగయ్యచెరువు గట్టును ఆక్రమించి ఏర్పాటైన షెడ్లు

క్షేత్రంలో రద్దీ రోడ్డుపై పోటీ వ్యాపారాలు

నిలిచిపోతున్న వాహనాలు

భక్తులు, వాహనదారులకు ఇక్కట్లు

పట్టించుకోని అధికార యంత్రాంగం

ద్వారకాతిరుమల,మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి.. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు అడ్డం పడి అక్కడి చిరు వ్యాపారులు జరిపే వ్యాపారం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. అధికారులు, పాలకులు పట్టించుకోవం లేదు. వ్యాపారులు నిత్యం కార్లకు అడ్డుపడి మరీ విక్రయాలు చేస్తుండడంతో రహదారిపై సంచరించే వాహనదారులతో పాటు కార్లు, ఇతర వాహనాలలో వెళ్లి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి ఒక్కోసారి ప్రమాదాలకూ గురవుతున్నారు. నిత్యం ద్వారకా తిరుమలేశుని ఆలయానికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. అదిక శాతం మంది వాహనాల్లో శేషాచలం కొండపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే కొండపైకి వెళ్లే దారిలో ఉన్న లింగయ్య చెరువు గట్టు ప్రాంతాన్ని కొందరు వ్యాపారులు ఆక్రమించుకుని అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు మలుపులో దాదాపు ఇరవై మంది వరకూ మహిళలు నిమ్మకాయలు, వంకాయలు, ఇతర కూరగాయలను ప్లాస్టిక్ కవర్లలో ఉంచి ఆలయానికి రాకపోకలు సాగించే వాహనాలను ఆపి విక్రయిస్తున్నారు. దీన్ని స్థానిక, పరిసర ప్రాంత రైతులు వాహనదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదు.. ఇదెక్కడి దారణం అంటూ ప్రశ్నిస్తున్నారు.

అధికారులు ఏం చేస్తున్నారు ?

రద్దీని క్రమబద్ధీకరించాల్సిన అధికారులు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని స్థానికులు, రైతులు ఆవేదన చెందుతున్నారు. శ్రీవారి శేషాచలం పైకి వెళ్లే ప్రాంతంలో ఇలా ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తుంటే నిత్యం దర్శనాలకు వచ్చే జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ వాపోతున్నారు. ఈ ప్రాంతంలో అటు దేవస్థానం లేదా ఇటు పోలీసులు ఏవిధమైన సెక్యూరిటీని ఏర్పాటు చేయక పోవడం పట్ల స్థానికులు గుర్రుమంటున్నారు. పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కార్లను ఆపి విక్రయిస్తున్న దుకాణదారులు

టెంకాయ పేలి..టెంట్ కాలిపోయింది

జీలుగుమిల్లి, మార్చి, 24 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో ఒక దేవాలయం వద్ద హోమం చేస్తుండగా టెంకాయ పేలి టెంట్ తగలబడింది. గ్రామంలో గోలగమూడి వెంకయ్య స్వామి భక్తులు ఆరాధనోత్సవాలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం హోమాలు, అన్న సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హోమం జరుగుతున్న సమయంలో హోమ గుండంలో వేసిన కొబ్బరి కాయ పేలి పైకి వెళ్లి టెంట్‌హౌస్‌పై పడింది. అది వాటర్ ప్రూఫ్ ది కావడంతో వెంటనే అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో టెంట్‌లోని వారంతా పరుగులు తీశారు. సౌండ్ సిస్టమ్ కొంత సామాగ్రి కాలి పోయింది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.





ఉగాది మండపాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

ఉగాది వేడుకలకు చిన వెంకన్న క్షేత్రం ముస్తాబు

ద్వారకాతిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని శ్రీవారి క్షేత్రం ముస్తాబవుతోంది. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఉగాది మండపాన్ని రంగులతో, పందిళ్లతో నయనానందకరంగా తీర్చిదిద్దే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 30న జరుగనున్న విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలకు మండపాన్ని, పరిసరాలను ముస్తాబు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఉగాదిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన రాజగోపురం, ఇతర గోపురాలను, అనివేటి మండప ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 30న సాయంత్రం శ్రీవారు ఉభయ దేవేరులతో మండపంలో కొలువై భక్తులకు దర్శనమిస్తారు. అక్కడ అర్చకులు, పండితులు పంచాగ శ్రవణం తరువాత పండిత సత్కారం, తీర్థప్రసాద వినియోగం జరుగనున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది-2025 పండుగను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పల్లెలు, పట్టణాలకు చెందిన కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, క్రీడాకారుల ప్రతిభ, సేవలను గుర్తించి వారిని 'శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాలతో ఘనంగా సన్మానిం చేందుకు అర్హులైనవారి నుంచి దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్ నారా యణ మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత రంగాల్లో తమ ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్ల ఫోటోలు, జిరాక్స్ కాపీలతో పాటు, 4 పాస్‌పోర్టుసైజు ఫోటో లను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 31వ తేదీలోగా 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15' చిరునామాకు పంపాలని సూచించారు. ఎంపికైనవారికి ఏప్రిల్ 13న హైదరా బాద్‌లో నిర్వహించే ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో అవార్డులను అందజేస్తామన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

29న గూటాల ఫెర్రీ రేవు వేలం

పోలవరం మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గూటాల ఫెర్రీ రేవు బహిరంగ వేలం ఈ నెల 29 న గూటాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూటాల గ్రామం నుండి తూర్పుగోదావరి జిల్లా వంగలపూడి గ్రామానికి గోదావరిపై లాంచీ నడపుకొనేందుకు 2025-2026 సంవత్సరాలకు గాను బహిరంగ వేలం హక్కులు పొందేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నామని ఆసక్తి గలవారు ఉదయం 10.30 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. 5 లక్షల సాల్వెన్సీ, లక్ష రూపాయల ధరావతు చెల్లించి పడవ లేదా లాంచీ లైసెన్సు వాహన రిజిస్ట్రేషన్ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఇన్సూరెన్సు నకలు, రూట్ పర్మిట్ నకళ్లతో వేలంలో పాల్గొనాలని సూచించారు.


పొగాకు వేలం ప్రారంభిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

● ఆరంభ ధర కిలో రూ.290 ● తొలి రోజు రైతులకు నిరాశ

జంగారెడ్డిగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు పొగాకు వేలం కేంద్రాలలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లను పొగాకు బోర్డు చైర్మన్ వై.యశ్వంత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ముందుగా వేలం కేంద్రం-32 వద్ద యశ్వంత్ కుమార్, వేలం కేంద్రం అధికారులు, బయ్యర్లు పూజా కార్యక్రమాల అనంతరం వేలం ప్రారంభించారు. మొదటి రోజు 99 బేళ్ల వేలంకు రాగా కిలో పొగాకు రూ.290 ధర పలికింది. వేలం కేంద్రం-18లో 99 బేళ్ల వేలంకు రాగా ఈ కేంద్రం లో కూడా కిలో పొగాకుకు రూ.290 ధర పలికింది.

యశ్వంత్ కుమార్ మట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వర్జీనియా పొగాకు 167 మిలియన్ల కిలోల పొగాకు పండించాలని పొగాకు బోర్డు రైతులకు నిర్దేశించిందని, రైతులు 240 మిలియన్ కిలోల పొగాకు పండించారన్నారు. ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలోని జంగారెడ్డిగూడెంలో 2, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురంలో కూడా రైతులు అదనంగా పండించారన్నారు. రైతుల వద్ద చివరి ఆకును కూడా పొగాకు బోర్డు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని, బయట అమ్మవద్దని ఆయన సూచించారు. వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది బ్రెజిల్‌లో 700 మిలియన్ల కిలోలు, జింబాబ్వేలో 300 మిలియన్ల కిలోల పొగాకు పండిందని తెలిపారు. కర్ణాటకలో ఇంకా పొగాకు అమ్మకాలు జరుగుతున్నాయని అక్కడ మార్కెట్ పూర్తవగానే ఏపీలో కొనుగోళ్లు ఊపందుకుంటాయన్నారు.

మొదటి రోజే నిరాశ..

మొదటి రోజు వేలంలో కిలో పొగాకుకు రూ. 300 పైగా ధర వస్తుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. సోమవారం జరిగిన వేలంలో కిలో పొగాకు ధర రూ.290 పలికింది. ఈ ధర రైతులకు తీరని నష్టాన్ని తీసుకువస్తుందని జంగారెడ్డిగూడెంలోని పొగాకు వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షుడు పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు అసహనం వ్యక్తం చేశారు. ఇదే ధర కొనసాగితే రైతులు అప్పులు ఊబిలో కూరుకు పోతారన్నారు. రైతులకు బోర్డు ఇచ్చిన లక్ష్యం మేరకు పండించిన పొగాకుకైనా యావరేజ్ ధర రూ.350, గరిష్ఠ ధర రూ.411 వచ్చేలా సహకరించాలని బోర్డు చైర్మన్‌ను కోరారు. వచ్చే పది రోజులు మార్కెట్ ధరలను పరిశీలిస్తామని తమకు గిట్టుబాటు ధరలు రాకపోతే రైతులంతా మాట్లాడుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలో ఉన్న 5 పొగాకు వేలం కేంద్రాలను సమానం చేసి అమ్మకాలు జరిగేలా చూడాలని బోర్డు చైర్మన్‌ను కోరారు. ఆక్షన్ సూపరింటెండెంట్‌లు బి.శ్రీహరి,జె.నరేంద్రకుమార్, రైతు సంఘం నాయకులు కరాటం రెడ్డిబాబు, గడ్డమణుగు సత్యనారాయణ, కొడవటి సత్తిరాజు, వామిశెట్టి హరిబాబు, గద్దే లక్ష్మణరావు, అట్లూరి సతీష్, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ పదోన్నతులకు బ్రేక్



- ఏలూరు నగర పాలక సంస్థలో కార్మిక నాయకుడి ఫిర్యాదు
- విజిలెన్స్ విభాగం విచారణ
- నివేదిక కోరిన లోకాయుక్త

ఏలూరు టూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో అక్రమ పదోన్నతులకు బ్రేక్ పడింది. నాలుగో తరగతి ఉద్యోగులు తొమ్మిది మందికి హెవీ వెహికల్ డ్రైవర్లుగా 2022 మార్చిలో ప్రమోషన్లు ఇచ్చారు. వీరిలో ఆరుగురికి అర్హత లేకున్నా ప్రమోషన్లు ఇచ్చారంటూ కార్మిక నాయకుడు ఆర్‌టీఐ యాక్ట్ కింద వివరాలు అడిగి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది. ఈ క్రమంలో మరో ఉద్యోగి తనకు అర్హత ఉన్నా ప్రమోషన్ ఇవ్వకుండా అర్హత లేని వారికి ఇచ్చారంటూ లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. లోకాయుక్త కోర్టు డ్రైవర్ల పదోన్నతులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు, రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ విచారణ ప్రారంభించారు.

డీఎంఏ రీజనల్ డైరెక్టర్‌ను విచారణ అధికారిగా ఆదేశాలు జారీ చేసింది. రాజమండ్రి ఆర్డీ నగరపాలక సంస్థ అధికారులను పదోన్నతులకు సంబంధించిన పూర్తి వివరాలతో విచారణకు రావాలని ఆదేశించారు. ఈనెల మార్చి 15న అత్యవసరంగా నగరపాలక సంస్థ పాలకమండలి స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆరుగురికి పదోన్నతులను రద్దు చేశారు. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి మూడేళ్ల అనుభవం ఉన్న ముగ్గురు డ్రైవర్లకు ప్రమోషన్లు ఇచ్చారు. దీంతో ప్రమోషన్లు రద్దయిన ఆరుగురు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. అర్హత లేనప్పుడు మాకు ప్రమోషన్లు ఎందుకిచ్చారని ప్రశ్నిస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రమోషన్లు ఇచ్చి పే ఫిక్సేషన్ చేయకుండా ఎందుకు కాలయాపన చేశారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. మరోవైపు తనకు అర్హత ఉన్నప్పటికి ప్రమోషన్లు ఇవ్వకుండా అనర్హులకి ఎందుకిచ్చారంటూ లోకాయుక్తకు వెళ్లిన ఉద్యోగి తనకు ప్రమోషన్ ఇవ్వకుండా ఎగ్గొట్టేందుకే అనర్హుల ప్రమోషన్లు రద్దు చేశారని ఆరోపిస్తున్నాడు. అర్హత లేకపోయినా ఉద్యోగుల నుంచి లంచాలు తీసుకుని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమోషన్లు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక పక్క విజిలెన్స్ ఎంక్వైరీ, మరోపక్క కలెక్టర్ విచారణ, ముఖ్యంగా లోకయుక్త ఆదేశాలతో నగర పాలక సంస్థ అధికారులు, పాలకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద, భీమవరంలో ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా

ఏలూరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు, వర్తక వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న కారణంగా విద్యుత్ మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతున్నారని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి కె.మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి డీఆర్వోకు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్స్ విద్యుత్ సంస్థలోనే విద్యార్హతలను బట్టి ఉపాధి కల్పించాలని, 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారి కుటుంబాలు వీధి పాలుకాకుండా విద్యుత్ శాఖలోనే ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గారావు, ఎస్.అప్పారావు, వి.స్వామి, యూనియన్ నాయకులు వెంకట్రావు, ధర్మరాజు, రామకృష్ణ, గోపి, శ్రీధర్ పాల్గొన్నారు.

● భీమవరం అర్బన్: విద్యుత్ స్మార్ట్ మీటర్స్ పేరుతో మీటర్ రీడర్లను రోడ్డును పడేయవద్దని, స్మార్ట్ మీటర్లు మనపై రుద్దడం దారుణమని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు అన్నారు. ఏఐటీయుసీ, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం చౌక్ సెంటర్లో ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి సమర్పించారు. కార్యక్రమంలో యునియన్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, రంగరావు, సీతారంప్రసాద్, జాకాబ్, వి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, బాలాజీ నరశింహ, అఖిల్‌రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు : అధికారుల సమీక్ష

ఏలూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 25 నుంచి 27 వరకు నాలుగు వేర్వేరు పోస్టులకు పరీక్షను నిర్వహించనుందని డీఆర్వో వి.విశ్వేశ్వర రావు తెలిపారు. జిల్లాలో పరీక్షల సమన్వయ అధికారిగా వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో ఏర్పాట్లపై సోమవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో పరీక్షలను విజయవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను డీఆర్వో ఆదేశించారు.

● భీమవరం రూరల్: ఏపీపీఎస్‌సీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఏర్పాట్లపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ నెల 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, 25, 26 తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అనలిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగాలకు, 26, 27వ తేదీల్లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. భీమవరం డీఎన్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, డీఎన్‌ఆర్ కాలేజ్, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లదే కీలక బాధ్యత అని డీఆర్వో స్పష్టం చేశారు.

బంతి బంతికి బెట్టింగ్



ఖాతాలు మారుతున్న సొమ్ము

- జట్టు విజయం, పరుగులు, ఆటగాళ్ల స్కోర్‌పై నిమిష.. నిమిషం పందెం!
- ఐపీఎల్ సీజన్‌తో భారీగా పందేలు కడుతున్న యువత
- యాప్‌లు, వాట్సాప్, టెలిగ్రామ్ వేదిక బెట్టింగ్ గ్రూపులు?
- పోలీస్ నిఘా.. బైండోవర్ లెక్కచేయని నిర్వాహకులు

తాడేపల్లిగూడెంకు చెందిన ఒక యువకుడు ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభమైన నాటి నుంచి ముగిసే వరకూ తను చేసే పనులకు వెళ్లడు. ఎప్పుడు.. ఏ మ్యాచ్.. ఎవరెవరి మధ్య జరుగుతుంది.. ఏ ప్లేయర్ ఆడతాడు వంటి అంశాలపై దృష్టి సారిస్తాడు. గతంలో ఒక ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్‌తో రూ.5లక్షలు సంపాదించాడు. ఇదేదో బాగుందని ఆ యువకుడిని అనుసరించి మరికొందరు బెట్టింగ్‌లో దిగుతున్నారు. తరువాత ఆ తర్వాత పలు సీజన్‌లలో సొమ్ములు పోగొట్టుకోవడం తప్ప వచ్చిందేమి లేదు. ఇదే తీరుతో చాలామంది బెట్టింగ్ వేసి ఉన్నది పోగొట్టుకుని ఎదురు అప్పుల పాలవుతున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో ఒకప్పుడు వారంతా సాధారణ యువకులు కొన్నేళ్లుగా క్రికెట్ బెట్టింగ్‌తో వారికి పంట పండింది. భారీమొత్తం సమకూరడంతో బుకీలుగా చలామణి అవుతున్నారు. రాజకీయంగా కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కీలకంగా ఉన్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌తో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. అక్కడి నుంచి బెట్టింగ్ నిర్వహించి గుమస్తాలతో వసూళ్లు చేస్తున్నారు.

గత ఏడాది ఏప్రిల్‌లో నారాయణపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు బెట్టింగ్‌లో నష్టపోయి బెనారస్‌లో ఒక అతిథి గృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సెల్ఫీ వీడియోలో తమ చావుకు కారణం ఫలానా వారేనని పేర్కొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్/ఉంగుటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువతను బెట్టింగ్ భూతం పట్టి పీడిస్తోంది. బెట్టింగ్ యాప్స్‌తో పాటు టెలిగ్రామ్, వాట్సాప్ వేదికగా బుకీలు యువతను ఆకర్షిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో లక్షల్లో పందెం కట్టి సొమ్ము పోగొట్టుకున్న వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు. అభిమాన క్రికెటర్, అభిమాన జట్టుపై ఆసక్తితో మా జట్టు గెలుస్తుంది. మా ప్లేయర్ సెంచరీ చేస్తాడని స్నేహితులతో సరదాగా పందెం కట్టడం ఒక ఎత్తు. బంతి బంతికి బెట్టింగ్‌తో పాటు మ్యాచ్ విజయం, ఆలౌట్, స్కోరుపై పందేలు కాస్తున్నారు. ఆన్‌లైన్ యాప్స్‌లో ఆఫర్లు చూసి లక్షకు రెండు లక్షల రూపాయలు వస్తాయనే ఆశతో పందేలు కాసి మొత్తం పోగొట్టుకుంటున్న వారు అధికం. ఇటీవల బెట్టింగ్ యాప్స్ నియంత్రణ చర్యలతో పలువురు సెలబ్రిటీలు కేసుల్లో చిక్కుకునా బెట్టింగ్ భూతం యువతను వదలడంలేదు.

అంతా ఆన్‌లైన్..

గతంలో యువత ఓ చోటకు చేరి బెట్టింగ్‌కు పాల్పడేవారు. ప్రస్తుతం బెట్టింగ్ మొత్తం ఆన్‌లైన్. అరచేతిలో ఫోన్ ఉంటే లక్షలు పందెం కాస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో డబ్బు కంటికి కనపడకుండా ఖాతాలకు మళ్లుతున్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, వాట్సాప్ పే వేదికగా బెట్టింగ్ సొమ్ము ఖాతాలు మారుతోంది. యువత చేతికి, గుండెకు అడ్డు అదుపు లేకుండా పందేలు కాస్తున్నారు. చివరికి అప్పుల భారం పెరిగిపోయి కుటుంబాలు రోడ్డున పడడంతోపాటు చివరకు బలవన్మరణాలకు దారితీస్తోంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సొమ్ముల లావాదేవీలపై నిఘా ఉంచి అడ్డుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలోని కైకరం, నారాయణపురం, చేబ్రోలు, ఉంగుటూరులో వేర్వేరు ప్రదేశాల నుంచి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. మ్యాచ్ ముగిసిన మరుసటి రోజు గుమస్తాలతో డబ్బు వసూలు చేయడం లేదా బ్యాంకు ఖాతాల ద్వారా లావాదేవీలు సాగిస్తున్నారు. బుకీలు మాత్రం హైదరాబాద్, విశాఖ, బెంగళూరు ప్రాంతాల్లో దందా నిర్వహిస్తున్నారు. మండలంలోని కైకరంలో సుమారు 20 మంది క్రికెట్ బుకీలు ఉన్నట్లు పోలీసు వర్గాల అంచనా. నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్సై ఎం.సూర్య భగవాన్ పలువురు బుకీల గుమాస్తాలను తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు.

జూదరులపై ప్రత్యేక నిఘా



క్రికెట్ మ్యాచ్‌ల ఫలితాలపై డబ్బులు పెట్టడం చట్టవిరుద్ధం. ఈ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయి. బెట్టింగ్‌లు వేసేవారిని, వారిని ప్రేరేపించేవారిపై ప్రత్యేక నిఘా పెడతాం. బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

డి.విశ్వనాథ్, డీఎస్పీ తాడేపల్లిగూడెం

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం
- భార్య, ప్రియుడి అరెస్ట్


విలేకరుల సమావేశంలో కేసు వివరాలు చెబుతున్న సీఐ వెంకటేశ్వరరావు

జీలుగుమిల్లి, మార్చి, 24: (ఆంధ్రజ్యోతి): తాటియాకులగూడెంలో ఇటీవల గంధం బోసు (35) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రియుడితో కలిసి భర్తను హతమార్చినట్లు గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరావు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు తెలిపారు. గంధం బోసు గతంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఏడాది క్రితం అవకతవకల నేపథ్యంలో సస్పెండ్ అయ్యాడు. అప్పటి నుంచి భార్య శాంతకుమారి భర్త బోసు ఇద్దరి మధ్య తరచు వివాదాలు వస్తున్నాయి. శాంతకుమారికి తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంకు చెందిన సొంగా గోపాలరావుతో పెళ్లికి ముందు నుంచి పరిచయం ఉంది. అతడితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. బోసు కూడా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను హింసించేవాడని, ఎన్నికల సమయంలో బెట్టింగ్‌లు కట్టి అప్పుల పాలయ్యాడు. భార్య వద్ద డబ్బులు బలవంతంగా తీసుకునేవాడని, భర్త పెట్టే బాధలు పడలేక భర్తను వదిలించుకోవాలని గోపాలరావుతో మాట్లాడింది. ఇద్దరు కలసి సరైన సమయం కోసం వేచి చూశారు.

జీలుగుమిల్లి తిరునాళ్ల నిర్వహణలో అవకతవకలు బయట పడ్డాయని ప్రచారం సాగింది. ఈ విషయమై ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరావు బోస్‌ను ఫోన్‌లో బెదిరించాడు. బెదిరింపు కాల్ సోషల్ మీడియా వేదికగా వైరల్ అయింది. ఇదే అదునుగా తన భర్తను హతమార్చితే ఆ నెపం చిర్రి వెంకటేశ్వరావు మీదకు వెళతుందని శాంతకుమారి, ఆమె ప్రియుడు గోపాలరావు భావించారు. ఈ నెల 17 తేదీ రాత్రి ప్రియుడు గోపాలరావును ఇంటికి రమ్మని శాంతకుమారి ఫోన్‌లో మెసేజ్ చేసింది. భార్యభర్త, పిల్లలతో కలసి బయట వరండాలో నిద్రించారు. బోసు నిద్రపోతుండగా పథకం ప్రకారం గోపాలరావు ఇనుప రాడ్డుతో బోసు తలపై బలంగా కొట్టి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న బోసును ఉదయం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు విచారణలో నిందితుల సెల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలితో ఒక దినపత్రిక విలేకరి ఫోన్ చాటింగ్ వివరాలు పోలీసులు గుర్తించారు. విలేకరిని కూడా విచారించి, అతడి ఫోన్ సిమ్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని, వారిని జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

తమ్ముడిని హతమార్చిన అన్నకు జైలు

- ఆస్తి తగాదాలో కత్తితో దాడి
- ఆకుతీగపాడులో ఘటన
- ఏడేళ్లు జైలు శిక్ష వేసిన కోర్టు

పెంటపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : ఆస్తి తగాదాల నేపథ్యంలో జరిగిన గొడవలో తమ్ముడిపై కత్తితో దాడి చేసి హత్యచేసిన అన్నకు కోర్టు జైలు శిక్ష విధించింది. తాడేపల్లిగూడెం 11వ ఏడీజే కోర్టు 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన చిన్నం శ్రీనివాస్, చిన్నం వెంకటేశ్వర్లు (28) అన్నదమ్ములు. ఒకే ఇంటిలో వేర్వేరు పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. ఆస్తి విషయమై ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. గత ఏడాది జనవరి 9న అన్న దమ్ముల ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. తమ్ముడు వెంకటేశ్వర్లుపై శ్రీనివాస్ కత్తితో దాడి చేయగా మెడకు బలమైన గాయమైంది. ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెదాడు. దీనిపై అప్పటి ఎస్ఐ హరికృష్ణ హత్య కేసు నమోదు చేశారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, రూరల్ సీఐ రమేశ్ పర్యవేక్షణలో ఎస్ఐ స్వామి, ఏఎస్ఐ రాజేందర్ కేసు విచారించారు. కోర్టు విచారణలో పీపీ. పి.శివరామకృష్ణ కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో తాడేపల్లిగూడెం 11వ ఏడీజే కోర్టు న్యాయాధికారి షేక్ సికిందర్ నిందితుడికి 7 సంవత్సరాల జైలు శిక్ష విధించారు.

మద్యం సీసాల చోరీ కేసులో నలుగురికి జైలు, జరిమానా

ఏలూరు క్రైం/లింగపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణం వాచ్‌మెన్‌పై దాడిచేసి మద్యం సీసాలు ఎత్తుకెళ్లిన నలుగురిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు.

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం శివారులోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద వాచ్‌మెన్ ఉన్నాడు. 2022 అక్టోబర్ 20న అర్ధరాత్రి పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన బోయిన శ్రీ సూర్య (22), పెదపాడు మండలం తాళ్ళమూడి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపీ(22), కోట శ్యామ్‌కుమార్ (19), కంభం అరవింద్ (20) బొలెరో వాహనంలో వచ్చి వాచ్‌మెన్‌ను కొట్టి షాపులో బ్రాందీ బాటిల్స్ అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై అప్పటి ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు కేసు నమోదు చేయగా అప్పటి చింతలపూడి సీఐ ఎంవిఎస్ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదో అదనపు జిల్లా కోర్టులో విచారణ సాగింది. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1500 రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి రాజేశ్వరి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదించగా ధర్మాజీగూడెం వెంకన్న, కానిస్టేబుల్ రవి, కోర్టు మానిటరింగ్ హెడ్‌కానిస్టేబుల్ కెఎస్ఎన్ మూర్తి, ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏఎస్ఐలు రుక్మాంగదరావు, సిసిలి సహకరించారు.


విద్యార్థినుల మొబైల్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించిన పోలీసు అధికారులు

శక్తి యాప్‌తో రక్షణ

ఏలూరు క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతను మెరుగు పరిచేందుకు ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్‌ను అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయాన్ని పొందవచ్చునని పోలీసు అధికారులు అన్నారు. ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వారి మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఏవిధంగా వినియోగించాలనేది తెలియజేశారు. శక్తి యాప్ ద్వారా ఎలాంటి పరిస్థితుల్లోనైనా తక్షణ సహాయం పొందవచ్చునని, ఎలాంటి అసౌకర్యం, అత్యవసర పరిస్థితి ఎదురైతే పోలీస్ సహాయం పొందడానికి ఈ యాప్‌ను వినియోగించవచ్చునని వివరించారు.

గోదావరిలో జారి పడి ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ గంగాధర్

పెనుగొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం వద్ద గోదావరిలో జారిపడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ కె.గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం రామన్నపాలెంకు చెందిన బాలిశెట్టి సురేష్‌బాబు (37) పాత ఇనుము కొనుగోలు చేస్తుంటాడు. సోమవారం సురేష్‌బాబు బాబాయ్ సూరిబాబుతో కలిసి పాత ఇనుము కొనుగోలుకు వెళ్లాడు. ఉదయం 7.30 సమయంలో సిద్ధాంతం కొత్త బ్రిడ్జి సమీపంలో గోదావరి లంకల దిబ్బ వద్ద సురేష్‌బాబు మల విసర్జనకు వెళ్లి గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా సుమారు 10 గంటల సమయంలో సురేష్‌బాబు మృతదేహం లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. సురేష్‌బాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తలనొప్పి భరించలేక..

పెంటపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తలనొప్పి భరించలేక కలుపు మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన పెదపోలు సత్యవతి(40) కొంత కాలంగా తలనొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. ఈ నెల 20న తలనొప్పి భరించలేక కలుపు మందు తాగేసింది. కుటుంబసభ్యులు ఆమెను తణుకు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ సోమవారం మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు


ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

ఏలూరు టూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుచేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీ మహేశ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో సోమవారం కేంద్రకార్మిక మంత్రి శోభను ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 83 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్మికుల కోసం ఆయూష్మాన్ భారత్, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, శ్రమయోగి మాన్‌ధాన్, ఆహారభద్రత చట్టం పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మరోప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాల కోసం 226 కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు. కేంద్రం నిధులతో 50వేల గృహాలు పూర్తయ్యాయని మరో రూ. 40వేల గృహాల నిర్మాణానికి నిధులు ఇస్తున్నామన్నారు.

ప్రేమ పేరుతో మోసం

బాధిత యువతి ఫిర్యాదు

భీమవరం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిసిన తర్వాత మొఖం చాటేశాడంటూ పట్టణానికి చెందిన ఒక యువతి వన్‌టౌన్ పోలీసులకు ఈ నెల 22న ఫిర్యాదు చేసింది. సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఒక యువతిని గుడిసె ఉదయ్ అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ప్రేమించకపోతే చనిపోతానంటూ బెదిరించడంతో అతడితో స్నేహం చేసింది. వారిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతుంది. 2023 మేలో ఉదయ్ తన పుట్టిన రోజు అంటూ చెప్పి ఆమెను హోటల్ రూంకు రమ్మన్నాడు. ఆమె స్నేహితులతో కలిసి హోటల్‌కు వెళ్లగా కేక్ కటింగ్ అనంతరం ఉదయ్ ఆమె స్నేహితులను పంపించేశాడు. యువతికి మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. అనంతరం ఉదయ్‌కు పలు శాఖల్లో ఉద్యోగం రావడంతో ఆ యువతి నిలదీసేది. తప్పకుండా పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ వచ్చాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో మొహం చాటేసినట్లు ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని, ఉదయ్‌తో వివాహం కాకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు.

కొట్లాట కేసు నమోదు

భీమవరం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తన సోదరుడి కుమారుడు కత్తిపీట, నిచ్చెనతో దాడిచేశాడంటూ భీమవరం బలుసుమూడికి చెందిన కట్రెడ్డి నరసింహారావు టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు కుమారులు ఆదివారం ఒక గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతుండగా నరసింహారావు అన్న కుమారుడు అక్కడే మద్యం సేవిస్తున్నాడు. పోలీసులు వస్తారని నరసింహారావు కుమారుడు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. ఈ కేసులో పరస్పరం ఇరు వర్గాల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

టెన్త్ గణితం పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రెగ్యులర్ విభాగానికి జిల్లా మొత్తంగా 22,683మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 22,231 మంది హాజరయ్యారు. ప్రైవేటుగా 1260 మందికి 1025 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. కాగా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య గణితం పరీక్షకు 611 మందికి 531 మంది హాజరయ్యారు.

అధిక ఉష్ణోగ్రతల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరుటూటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో కార్మికులకు ఎండదెబ్బ తగలకుండా యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలని ఉపకార్మిక కమిషనర్ పీ.శ్రీనివాస్ అన్నారు. కార్మికశాఖ కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపకమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో పని చేయించకూడదన్నారు.

30 నుంచి గోవాడ అంకమ్మ పేరంటాలమ్మ జాతర

దెందులూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) :మేజర్ పంచాయతీ కొవ్వలి గ్రామ దేవత గోవాడ అంకమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు 30వ తేదీ నుంచి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ గోవాడ నాగరాజు తెలిపారు. 30న గ్రామంలో అమ్మవారి విగ్రహంతో గ్రామోత్సవం జరుగుతుందని, కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 2న భారీ అన్నదాన ఉంటుందని కమిటీ కార్యదర్శి గోవాడ శ్రీను, వైస్ ప్రెసిడెంట్ శీలం అప్పారావు, క్యాషియార్ గుళ్లపూడి రమేష్, సభ్యులు దుర్గారావు, సాయి, శ్రీను, సాంబ వెల్లడించారు.

సరైన జాగ్రత్తలతో క్షయ నివారణ

లింగపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : క్షయ పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కెగోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిశోర్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం సందర్భంగా లింగపాలెంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించుకునేలా పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులున్న వారికి క్షయ సోకే ప్రమాదం ఉందని, దగ్గినప్పుడు కళ్లెలో రక్తం వస్తే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నైమీషా, క్షయవ్యాధి నివారణా యూనిట్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

లింగపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) :నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల్లోని 18 ఏళ్లు నిండిన యువతకు వివిధ రంగాల్లో ఉపాధి లభించేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని సూర్య ఫంక్షన్ హాల్లో బ్యాంకర్లతో కలిసి ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం ద్వారా బ్యాంకు రుణాలు పొంది ఉత్పాదక రంగాల్లో రాణించేలా అవగాహన కల్పిస్తామన్నారు.

పెదపాడులో 27న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పెదపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలపై 27వ తేదీన సీజీఆర్ఎఫ్ ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో పెదపాడులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో వద్ద ఉదయం 10 నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్టు పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ టీవీ సత్యనారాయణ, మెం బర్ ఫైనాన్స్ షేక్ బాబర్‌లతో పాటుగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హాజరై సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈ కోరారు.

అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష 13కి వాయిదా

ఏలూరు అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఏప్రిల్ 6న నిర్వహించాల్సి ఉన్న పరీక్షను అదే నెల 13వ తేదీకి వాయిదా వేసినట్టు జిల్లా కో-ఆర్డినేటర్ బి.ఉమాకుమారి తెలిపారు. అభ్యర్థులు పరీక్ష తేదీ మార్పును గమనించి పరీక్షలకు హాజరుకావాలని కోరారు.

అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన

పెదపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఎఫ్.ఎ.సి.) ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పెదపాడు మండలం కలపర్రు జడ్పీ హైస్కూల్లో బాలబాలికలపై అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న అత్యాచారాలను ఎలా ఎదుర్కోవాలి, అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సమయాల్లో ఏవిధంగా స్పందించాలో వివరించారు.ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థులను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కె.రత్నప్రసాద్, హెచ్.ఎం. భీమయ్య, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలి

ఏలూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకునే భూములకు, అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రేంజ్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద బాధితులిచ్చే ఫిర్యాదులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేయాలని, ఆ స్టేషన్‌కు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలిసిన వారిలో ఏలూరు జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఎస్.స్టాలిన్, తదితరులున్నారు.

ఆన్‌లైన్‌లో డీఎస్సీ ఉచిత కోచింగ్

ఏలూరు రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈబీసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ డీఎస్సీ శిక్షణకు పొందేందుకు ఏలూరు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధి కారిణి ఆర్.వి.నాగరాణి తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, టీటీసీ, డీఎడ్, కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. మరింత సమాచారానికి(86861 80018) నెంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలి

టి.నర్సాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండేపాండురంగ సోమవారం డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు జనవరి 2వ వారం నుంచి నేటి వరకు చేసిన పనికి వేతనాలు చెల్లించాలన్నారు. ఏప్రిల్ నుంచి అందరికీ మళ్లీ వంద రోజుల పని దినాలు మొదలవుతాయని, గతంలో పనిదినాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. వెంటనే ఉపాధి కూలీలకు పని కల్పించి ఇప్పటి వరకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో నగరంలోని పలు డివిజన్లలో ప్రజా చైతన్య యాత్రలను సోమవారం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారని, వాటి పరిష్కారానికి తాము ఉన్నతాధికారులతో పోరాటాలు సాగిస్తామన్నారు.కార్యక్రమంలో కనకారావు, ప్రసాద్, ఆదిశేషు, విజయలక్ష్మి, దుర్యోధన, సోమయ్య, శివకుమార్, గోపి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోతున్న విద్యుత్ మీటర్ రీడర్స్

ఏలూరుకార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో విద్యుత్ మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోతున్నారని వామపక్షాలు సోమవారం ఏలూరులో నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.మల్లేశ్వరరావు, బి.స్వామి, వెంకట్రావు, ధర్మరాజు, రెడ్డి శ్రీనివాసడాంగేలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

వాహనదారులు భద్రతా నిబంధనలు పాటించాలి

ఏలూరు క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : 16వ నెంబర్ జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌ప్లాజా వద్ద సోమవారం రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించని, సరైన వాహన రికార్డులు లేని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్సు ఉండాలని, వాహనం నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. మోటారు వాహన నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ స్కూల్‌కు కంప్యూటర్ల బహూకరణ

ఏలూరు క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అమీనాపేటలోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు ఏలూరునకు చెందిన గుప్తా ఫౌండేషన్ అధినేత కె.కె.గుప్తా ఎనిమిది కంప్యూటర్లు బహూకరించారు.ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్‌కు కంప్యూటర్లను గుప్తా అందించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ కంప్యూటర్ల వల్ల విద్యార్థులకు నూతన సాంకేతికతను నేర్చుకునే అవకాశం కలుగుతుందని భవిష్యత్తులో మరింత సాంకేతిక విజ్ఞానం నేర్చుకోవడానికి వీలుపడుతుందన్నారు.

డివిజన్ వాచ్



లక్ష్మీనగర్‌లోని ఖాళీ స్థలంలో నిలిచిపోయిన మురుగు



రోడ్డు కోసం డ్రైనేజీని బ్లాక్ చేసిన దృశ్యం

సమస్యల వలయం..

49వ డివిజన్‌లో డ్రైనేజీలు అస్తవ్యస్తం
అంతంతమాత్రంగానే అంతర్గత రోడ్లు
పేరుకున్న మురుగుతో పెరిగిన దోమల బెడద

ఏలూరు టూటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరంలోని అనేక డివిజన్లలో సమస్యలు తిష్టవేశాయి.ఈ సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నేతలు హామీ ఇవ్వడంతో ప్రజలు కూటమిని అధికారంలోకి తెచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా సమస్యల పట్ల దృష్టి సారించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సమస్యలను పాలకులకు తెలియజెప్పి పరిష్కరించే దిశగా 'ఆంధ్రజ్యోతి' డివిజన్ వాచ్ కార్యక్రమం చేపట్టింది. 49వ డివిజన్‌లో ప్రధానంగా డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షాకాలంలో ఇక్కడ మోకాళ్లలోతు నీళ్లు నిలిచిపోతాయి. ఇక్కడ అంతర్గత రోడ్లు కూడా లేకపోవడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ డివిజన్‌లో కొన్ని కాలనీల్లో ఖాళీస్థలాలు పెద్దసమస్యగా మారాయి. లక్ష్మీనగర్‌లో జలజీవన్ మిషన్ పథకంలో డ్రైన్ల నిర్మాణం చేపట్టింది. వైసీపీ ప్రభుత్వంలో నిధులులేక డ్రైన్లు సగంలోనే ఆగిపోయాయి. ఉన్న డ్రైన్లతోనే వర్షపునీరు బయటకు వెళ్తోంది. ఈలోగా ఖాళీ స్థలాల యాజమానులు వారి స్థలాల్లోకి వెళ్లడానికి డ్రైన్లను పూడుస్తున్నారు. దీంతో డ్రైన్లలో నీరు ఎక్కడికక్కడే ఆగిపోయి మురుగు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. మరోవైపు అంతర్గత రోడ్లు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వేసవిలో నీరు నిల్వ ఉండిపోతోంది. ఈ మురుగులో పందులు, కుక్కలు దొర్లి చిరాకు కలిగిస్తున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి డివిజన్లలోని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

డివిజన్‌లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. దోమలు ప్రబలకుండా స్ప్రే చేస్తున్నాం. కుక్కలను పట్టుకెళ్లి కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నాం. పందులను ఊరుబయటకు తరలిస్తాం.

సంజీవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

కాలనీ సమస్యలపై ప్రత్యేక దృష్టి

వైసీపీ నిర్వాకం వల్ల పలు డివిజన్స్‌లో సమస్యలు పేరుకుపోయాయి. ఈసమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి తగినన్ని నిధులు కావాలి. నిధులు రాగానే రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తాం.

శ్రీనివాసరావు, కార్పొరేటర్

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

దెందులూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి, ఎంపీడీవో శ్రీదేవి అన్నారు.సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం సందర్భంగా పలు గ్రామాలకు చెందిన వారు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమలత, మండల అధికారులు పాల్గొన్నారు.



చింతలపూడిలో అర్జీ అందజేస్తున్న నాయకులు

చెరువుల ఆక్రమణలపై సర్వే చేయండి..

చింతలపూడి, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని చెరువులు, కుంటలపై సర్వే జరిపి ఆక్రమణలు తొలగించాలని సీపీఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్పందనలో సోమవారం ఫిర్యాదు చేసినట్టు కమిటీ నాయకులు టి.బాబు తెలిపారు. పంచాయతీ పరిధిలో 21 చెరువులకుపైగా ఉన్నాయని వీటిపై సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. నగర పంచాయతీ కమిషనర్‌కు కూడా గతంలో అందచేశామని, అయితే సర్వే అధికారులు అందుబాటులో లేరని, సమయం పడుతుందని చెప్పారని, జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో టి.మాణిక్యాలరావు తదితరులు ఉన్నారు.



పల్లాలమ్మ జాతరలో ఎమ్మెల్యే ధర్మరాజు, తదితరులు

పల్లాలమ్మ జాతరలో ఎమ్మెల్యే పత్సమట్ల

నిడమర్రు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : చానమిల్లి గ్రామ దేవత శ్రీపల్లాలమ్మ జాతరలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొత్తూరి వాసురాజు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ బేతు వెంకటరామారావు, వంగా రఘు, బేతు మరుళీ, తోట శ్రీను, ముత్యాల స్వామి పాల్గొన్నారు.

● భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అనేక పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొన్నారు. భీమడోలులో ఉపాధి హామీ నిధులు 40 లక్షలతో నిర్మించిన అంతర్గత మెటల్‌రోడ్డును, గుండుగొలను గ్రామంలోని హౌసింగ్ కాలనీలో 85 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన రోడ్డు, భీమడోలులో 50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, పోలసానపల్లి గ్రామంలో తిరుమల మిల్క్ డైరీ, గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వోవాటర్ ప్లాంటును, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు.

కోకో గింజలు కొనుగోలు చేయండి

ఏలూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందచేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు ఆందోలన బాటపట్టారు. ధర్నాలో ప్రాంతీయ కొబ్బరి రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బారెడ్డి, ఉండవల్లి వెంకట్రావు, గుదిబండి వీరరెడ్డి, కె.సతీష్‌బాబు పాల్గొన్నారు.

● కామవరపుకోట : కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తడికలపూడి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కోకో రైతులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కామవరపుకోట తహసీల్దార్ గెడ్డం ఎలీషాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోకో రైతు సంఘ నాయకులు, ఏపీ రాష్ట్ర యూనియన్ ట్రెజరర్ జాస్తి కాశిబాబు, ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఆర్డీవో కార్యాలయం వద్ద కోకో రైతులు టీవీఏ.గోపాల్, అట్లూరి రామరాజు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అట్లూరి శ్రీనివాసరావు, మోటేపల్లి కృష్ణ రాజారావు, వందనపు రమణ, జాన్‌విక్టర్,మారిశెట్టి రామదాసు, ఆంజనేయులు, బొడ్డు రాంబాబు, ఉండవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

● పెదవేగి : రైతుల వద్ద నిల్వ ఉన్న కోకో గింజలను కొనుగోలు చేయాలని కోకో రైతులు పెదవేగి తహసీల్దారు ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తహసీల్దారుకు, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారి ఎం. రత్నమాలకు వినతిపత్రాలు అందించారు. ఈ కా ర్యక్రమంలో ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు బొల్లు రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాల కృష్ణ, సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, సభ్యులు ఉండవల్లి వెంకట్రావు, మున్నంగి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో విధుల నుంచి తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర కార్మిక వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు దేవరపల్లి రత్నబాబు అన్నారు. మూడు నెలల క్రితం లింగపాలెం మండలంలో వీవోఏలుగా పనిచేస్తున్న 11 మందిని అకారణంగా విధుల నుంచి తొలగించారని దీంతో వారంతా రోడ్డునపడ్డారని అన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్పందించి ఆదుకోవాలని దేవరపల్లి రత్నబాబు విజ్ఞప్తి చేశారు.

పెదవేగిలో చలివేంద్రం ప్రారంభం

పెదవేగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని తహసీల్దారు ఎస్.డి. భ్రమరాంబ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటిని ఎక్కువగా తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కేవీవీ.సారధి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ఎక్సైజ్ దాడులు

చింతలపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అధికారులు సోమవారం విస్తృతంగా దాడులు జరిపారు. నాగిరెడ్డిగూడెం, తలార్లపల్లి, రేచర్ల, ప్రగడవరం, యర్రంపల్లి, వెలగలపల్లి, పంతంగులగూడెం గ్రామాల్లో ఈ దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెంలో నాలుగు కేసుల్లో వి.వెంకటేశ్వరరావు, ఇ.శోభన్‌బాబు, టి.తిరుపతమ్మ, ఇ.కమలమ్మ, ఇంకా నలుగురు పరారీలో ఉన్నారని, వీరికి సంబంధించిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు సీఐ భోగేశ్వరరావు, ఏఈఎస్ జి.పాండురంగారావు, సీఐ ఆర్.సత్యవతి, ఎస్ఐ ఎం.డి. ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నర్సాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని టి.నర్సాపురం, రుద్రాకోటరాజుగూడెం, తిరుమలదేవిపేట ఫీడర్లకు ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టీర్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఆయా ఫీడర్లకు వ్య వసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులుంటాయని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను ఒక యూనిట్‌గా గుర్తించి అందరికీ పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నిర్వాసితులందరికీ పరిహారం చెలించాలని, 2013 భూసేకరణచట్టం పటిష్టంగా అమలు చెయ్యాలని, 18 ఏండ్లు నిండిన యువతీ యువకులందరికీ పరిహారం ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏలూరు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, డి.రమేశ్, మండల నాయకులు దుర్గారావు, వెంకటరావు, సాయికిరణ్ పాల్గొన్నారు.



డీటీ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

బుట్టాయగూడెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డుల నుంచి అడంగల్(1బి)లను తరుచుగా తొలగించడాన్ని నిరశిస్తూ సోమవారం గిరిజనులు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇప్పటి వరకు రికార్డుల నుంచి గిరిజనులకు చెందిన భూముల వివరాలను మూడు పర్యాయాలు తొలగించారని ఆందోళన చేస్తే పొరపాటు జరిగిందంటూ వివరణ ఇచ్చారని అన్నారు.. ఒకసారి జరిగితే పొరపాటని పదేపదే జరుగుతుంటే పొరపాటు ఎలా అవుతుందని ప్రశ్నించారు. అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరోసారి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పి.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, న్యూడెమోక్రసీ, పీవైఎల్ సంఘాల నాయకులు ధర్ముల సురేష్, కారం రాఘవ, నాయకులు టి.బాబురావు, కె.పోతురెడ్డి, ఈ.భూషణం, బి.వినోద్, బి.శ్యాంబాబు, కె.శిరమయ్య, జి.నాగమ్మ, ఎం.శాంతకుమారి, కె.వెంకటలక్ష్మి, కె.శ్యామల పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఉంగుటూరు, మార్చి24(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని ఐ.సి.డి.ఎస్. సూపర్‌వైజర్ వి.శ్రీలక్ష్మి కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో, బాలిక వసతి గృహంలోను చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు.

సకాలంలో రైతులకు పంట రుణాలు

టి.నర్సాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సహకార సంఘ రైతులకు పంటరుణాలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని మధ్యాహ్నపు వారిగూడెం సహకార సంఘం అఫీషియల్ చైర్మన్ వై.ఏసుకుమార్ తెలిపారు. సంఘ ఆవరణలో సోమవారం ఏసుకుమార్ అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పంట రుణాలు, ఆలస్యమవుతున్నాయని రైతులు కోరడంతో స్పందించిన ఏసుకుమార్ మాట్లాడుతూ పంట రుణాల విషయం ఉన్నతాధికారులతో చర్చించి సకాలంలో అందేలా చూస్తామన్నారు. అలాగే ఏప్రిల్ 1నుంచి సొసైటీ ద్వారా సంఘ సభ్యులకు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయని సభ్యులంతా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో భుజంగరావు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే పోటీలు

భీమడోలు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మాధురి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కరాటే బెల్టు టెస్టు పోటీలు నిర్వహించారు. వివిధ రకాల కలర్ బెల్టు పోటీలు నిర్వహించారు. అనంతరం భీమడోలు ఎస్ఐ సుధాకర్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులు బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్రిజ్ అందజేత

ఏలూరు క్రైం, మార్చి24(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు శుభ్రమైన నీరు అందించేందుకు కూలింగ్ వాటర్ ఫ్రెషర్ ఫ్రిజ్‌లను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు.ఏలూరు అమీనాపేటలో ఉన్న శ్రీసురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషుమీడియం పోలీస్ స్కూలుకు 200 లీటర్ల సామర్థ్యం కల్గిన కూలింగ్ వాటర్ ఫ్రెషర్, 60 లీటర్ల సామర్థ్యం కల్గిన నాలుగు ఫ్రిజ్‌లను ఎస్పీ సోమవారం ఆ స్కూలు హెచ్‌ఎం స్రవంతికి అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు పోలీస్ శాఖ ఎప్పుడూ తోడుగా ఉంటుందని, ఇంకా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం చేపడతామన్నారు.



అమ్మవారి దర్శించుకుంటున్న తపనా చౌదరి

నూకాలమ్మ సేవలో తపనా చౌదరి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తపనా ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి కొత్తపేటలోని నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు తపనా చౌదరిని సత్కరించారు.

ఇంటర్వ్యూ..

ఉపాధి పనులపై దృష్టి

పాతిమా ప్రసన్న, ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీవో, దెందులూరు



● ఉపాధి హామీ పథకం లక్ష్యమేంటి?

జవాబు : ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నుంచి రూ.25 కోట్లకు అనుమతులు తీసుకున్నాం. ఇప్పటి వరకు రూ.20 కోట్ల 50 లక్షల వరకు పనులు చేయించాం.

● ఎన్ని రోజులు పని కల్పిస్తున్నారు? వేతనం ఎంత?

జవాబు : పని కోరిన ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజుల పని కల్పిస్తున్నాం. రోజువారీ వేతనం రూ.300 అందిస్తున్నాం.

● చేయిస్తున్న పనులు ఏమిటి?

జవాబు : ఉపాధి హామీ పథకంలో పంట కుంటలు తవ్వడం, రైతులకు నీరు నిల్వ చేసుకునేందుకు గుంతలు ఏర్పాటు చేయిస్తున్నాం. బల్బరీ వంటి ఉద్యానవన పంటలకు అవకాశం కల్పిస్తున్నాం. ఇంకా పంట కాల్వలు, చెరువులు, సాగునీటి కాల్వల పనులు చేయిస్తున్నాం. అలాగే ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటుకు 6 వేల రూపాయలు అందిస్తున్నాం.

● మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి?

జవాబు : మండలం మొత్తం మీద 40 మినీగోకులాలు మంజూరవగా యూనిట్‌కు రూ.2 లక్షల 30 వేలు కేటాయిస్తున్నాం. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

- దెందులూరు, ఆంధ్రజ్యోతి

రేపు పాలక మండలి సమావేశం

ఏలూరు టూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పాలకమండలి సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 26న మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరుగుతుందని నగరపాలక సంస్థ సెక్రటరీ జీ.చంద్రయ్య తెలిపారు. ఐదు అంశాలతో అజెండాను సిద్ధం చేశారు. ఇందులో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంశం ముఖ్యమైంది.

కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరురూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా సోమవారం కృత్రిమ అవయవాల పంపిణీని చేపట్టారు.సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ ఇంటర్వ్యూల్లో ఎంపిక

పెదపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : సర్ సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికల్లో 110 మంది విద్యార్థినులు పాల్గొనగా, వారిలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ జి.సరళ తెలిపారు. ప్రాంగణ ఎంపికల కోసం పలు ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు.ఎంపికైన విద్యార్థులను కళాశాల యజమాన్యంతో పాటుగా అధ్యాపక బృందం అభినందించారు.

తాటాకిల్లు దగ్ధం

పోలవరం, మార్చి24(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పోలవరం పంచాయతీ జెన్నవీధిలో సోమవారం తెల్లవారు జామున ఓ తాటాకిల్లు దగ్ధమైంది. పట్నాల సుబ్బాయమ్మ అనే వృద్ధురాలి తాటాకింటికి నిప్పు అంటుకోవడంతో స్థానికులు కొవ్వూరు ఫైర్ స్టేషన్‌కి సమాచారమిచ్చారు. ప్రతి యేటా వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిందని, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొవ్వూరు నుంచి ఫైర్ వాహనం పోలవరం చేరుకునే సరికే కాలాతీతమవుతోందని నష్టం తీవ్రత అధికంగా ఉంటోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పోలవరం మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శ్రీవారి హుండీ లెక్కింపు

ఏలూరుకార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావు పేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని సోమవారం ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో 55 రోజులకుగాను లెక్కించగా 6 లక్షల 36వేల 719 రూపాయలు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు.



దాతలకు బాండు అందజేస్తున్న ఏఈవో

విమానగోపుర స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల,మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ విమానగోపురానికి బంగారు తాపడం చేసే స్వర్ణమయ పథకం ట్రస్టునకు విజయవాడకు చెందిన దాత సోమవారం రూ.2.50 లక్షలను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన ఎన్.నరసింహరావు కుటుంబం ఈ నగదును ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ముందుగా దాత కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం విరాళం అందించగా దాత కుటుంబానికి ఆలయ ఏఈవో నటరాజారావు బాండు పత్రాన్ని అందించారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● మంగళవారం 25 మార్చి 2025

రేపు టీడీపీ ఆధ్వర్యంలో ఫిర్యాదులు స్వీకరణ

కైకలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 26న గ్రీవెన్స్ ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. ఈనెల 26న కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు అందరూ పాల్గొనాలని కోరారు.


ముదినేపల్లి మండలం పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలో రోడ్లపైకి వస్తున్న మురుగునీరు


కాలనీలో డ్రెయినేజీని బాగు చేసుకుంటున్న కాలనీ మహిళ

పెయ్యేరు కాలనీ వాసులను.. వీడని మురుగునీటి సమస్య

ముదినేపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెయ్యేరు పంచాయతీ ఏరియాలోని వైఎస్ఆర్ కాలనీని మురుగునీటి సమస్య ఏళ్ల తరబడి పట్టి పీడిస్తున్నది. కాలనీలోని 150 గృహాల్లో నివశిస్తున్న ప్రజలకు నిత్యం దుర్వాసన తప్పడం లేదు. కాలనీలో పది సిమెంట్ రోడ్లు నిర్మించారే కాని డ్రెయినేజీల నిర్మాణం జరుగలేదు. ప్రతీ ఇంటి ముందు మురుగునీరు నిలబడే ఉంటోంది. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ శాతం మంది నివశిస్తున్న ఈ కాలనీలో అడుగు పెట్టాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. డ్రెయినేజీ నీరు రోడ్లపైకి వస్తోంది. కాలనీ వాసులు మురుగునీటితోనే సహజీవనం చేస్తున్నారు. సీసీ రోడ్డుకు ఇళ్లకు మధ్యన ఉన్న ప్రదేశాన్ని కాలనీవాసులు బాగు చేసుకుని మురుగునీటి ప్రవాహానికి దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మురుగు నిల్వలతో దోమలు పెరిగాయి. దీంతో తరచూ కాలనీ వాసులు అనారోగ్యాల పాలవుతున్నారు. కాలనీ నుంచి వచ్చే మురుగునీటిని బయటికి నింపేందుకు డ్రెయినేజీ తవ్వే అవకాశం ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు.

ఎన్నాళ్లీ బాధలు



వైఎస్ఆర్ కాలనీ వాసులు మురుగునీటి సమస్యతో ఎంత కాలం ఇబ్బందులు పడాలి పంచాయతీ అధికారులు పట్టించుకోరు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలకు అనారోగ్యాలు వస్తున్నాయి.

- మొవ్వ ఫణీంద్ర, కాలనీ వాసి

శక్తియాప్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలి : సీఐ

కైకలూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణ మార్గానికి శక్తి యాప్ ఉపయోగపడుతుందని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. సోమవారం కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్లో గ్రామమహిళా సంరక్షణ కార్యదర్శులు, మహిళా పోలీసులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామ మహిళా పోలీసులు, మహిళా కార్యదర్శులు, హెల్ప్‌డెస్క్ సేవలు బాలల హక్కుల పరిరక్షణలో కీలకపాత్ర అని సూచించారు. ఎస్సైలు రాంబాబు, రామచంద్రరావు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కైకలూరు రూరల్ సీఐ రవికుమార్

ఐదు ట్రాకర్లు స్వాధీనం

నూజివీడు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దేవరగుంట గ్రామంలో మట్టి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తహసీల్దార్ సుబ్బారావు దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి సంఘటన స్థలానికి చేరుకున్న నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు, అధికారులతో కలిసి మట్టి తరలిస్తున్న 5 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. రూ. 12,500 అపరాధ రుసుం విధించినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు.

అంతర్జాతీయ మార్కెట్ ధరకు కోకో గింజలను కొనాలి

ముసునూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కొనుగోలు చేయాలని, అన్ సీజన్‌లో సైతం కోకో గింజలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ కోకో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొసరాజు రాధాకృష్ణ కోరారు. సోమవారం రైతులతో కలిసి తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు ఆయన వినతపత్రం అందజేశారు. ఏలూరు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణం ఉందన్నారు. ప్రస్తుత్తం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజల ధర రూ900 ఉన్నా, కంపెనీలు మాత్రం రైతులకు ఆ ధరను చెల్లించకుండా రూ 500 నుంచి 600 వరకు ఇస్తున్నారన్నారు. ఇంతకుమందు లేని గ్రేడింగ్ విధనాన్ని తీసుకురావడంతో రైతులు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను నష్టపరిచే చర్యలను అరికట్టాలని, కంపెనీలు కొనుగోలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే కోకో గింజలను కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ పథకాన్ని వర్తింపచేయాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు, రైతులు పాలొన్నారు.


తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కోతి కూల్‌డ్రింక్ ఎత్తుకొచ్చి స్టైల్‌గా తాగేసింది

చాట్రాయి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో మీసేవా కేంద్రం దగ్గర సోమవారం ఓ కోతి కూల్ డ్రింక్ ఎత్తుకొచ్చి స్టైల్‌గా తాగిన తీరును అందరూ ఆసక్తిగా చూశారు. ముందుగా అక్కడ పార్కు చేసి ఉన్న ద్విచక్రవాహనాల ట్యాంకు కవర్లలో ఏమైనా తినేవి తాగేవి ఉన్నావేమోనని కోతులు వెతికాయి. ఒక కోతికి కూల్ డ్రింక్ బాటిల్ దొరికింది. దాన్ని తీసుకొని పరిగెత్తుకుంటూ వచ్చి ప్రహరీ ఎక్కి కూర్చొని బాటిల్ మూత తీయడానికి ప్రయత్నించింది.. కానీ దాని వల్ల కాలేదు. తరువాత బాటిల్ కింద బాగంలో పళ్లతో చిల్లు పెట్టి స్టైల్‌గా చల్లచల్లని కూల్ డ్రింక్‌ను ఆస్వాదిస్తూ తాగేసింది.


బైక్ ట్యాంక్ కవర్లలో వెతుకుతున్న కోతులు
బాటిల్ అడుగున చిల్లి పెట్టి తాగుతున్న కోతి

చీపురుగూడెం భూములపై సర్వే చేయాలి

చాట్రాయి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో ఎన్నో ఏళ్ల క్రితం పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చిన భూములపై ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని, రెవెన్యూ, అటవీ శాఖ సంయుక్త సర్వే చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ చీపురుగూడెంలో చిట్టూరి మల్లయ్య, వెంకట్రామయ్య తదితరుల నుంచి ల్యాండ్ సీలింగ్ యాక్టు కింద ప్రభుత్వం 51.25 ఎకరాలు స్వాధీనం చేసుకొని పేదల పట్టాలు ఇచ్చినా అటవీశాఖ అడ్డుపడుతుందని, ఫలితంగా పేద రైతులకు ప్రభుత్వ పథకాలు అందక నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో రాయుడు, సుందరం, తిరుపతరావు పాల్గొన్నారు.

జనార్ధనవరంలో ఉచిత పశువైద్య శిబిరం

చాట్రాయి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జనార్ధనవరంలో పశు వైద్యాధికారి శివ నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. అంతుచిక్కని వ్యాధితో 10 గేదె దూడలు మృతి శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు స్పందించి ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 25 పశువులకు సాదారణ చికిత్సలు, 15 గేదెలకు చూడి పరీక్షలు, మరి కొన్ని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. జీవాల యజమానులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు, 15 పశువుల నుండి రక్త పేడ నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం నూజివీడు ల్యాబ్‌కు పంపినట్లు డాక్టర్ శివ నాగేంద్ర తెలిపారు. పశుపోషకులు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పశువులకు వైద్యం చేస్తున్న పశువైద్యులు

27న ప్రొద్దువాక పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక

ముదినేపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దువాక పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 27న జరుగనుంది. ఈ మేరకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. పంచాయతీ ఉపసర్పంచ్ రెండేళ్ల క్రితమే రాజీనామా చేయగా ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈక్రమంలో ఉపసర్పంచ్ ఎన్నికకు ఈనెల 27న ఉదయం 11 గంటలకు పంచాయతీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేశామని ఈవోపీఆర్డీ అశోక్ తెలిపారు. పోటీ ఉంటే చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

ఉపాధి లక్ష్యం నెరవేరేనా?

- వంద పనిదినాల కల్పనకు అధికారుల హడావుడి
- ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు.. కూలీల కొరత
- చేసిన పనులకు వేతనాలు పెండింగ్


సింగరాయపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులు

ముదినేపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న ఉపాధి హామీ పనులను నెలాఖరులోగా పూర్తి చేసేందుకు అధికారులు హడావుడిగా చర్యలు తీసుకుంటున్నారు. మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం పూర్తి కానున్నందున ప్రతీ కుటుంబానికి వందరోజుల పనిదినాలను కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 3.12 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2.92 లక్షల పనిదినాలను కల్పించారు. మిగిలిన 20 వేల పనిదినాలను కల్పించడం అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కష్టమైన ప్రక్రియగా మారింది. దీంతో పనిదినాల లక్ష్యం ఈ నెల 31లోగా పూర్తి చేయాలని, పలు గ్రామాల్లో పనులు వేగంగా జరగడం లేదంటూ ఎంపీడీవో వై.రామకృష్ణ 24 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామాల్లో మినపతీత పనుల వల్ల ఉపాధి పనులకు కూలీలు రాకపోవడం, గత 75 రోజులుగా కూలీలకు సొమ్ము అందకపోవడం వంటి సమస్యలు క్షేత్రస్థాయిలో ఉన్నాయని ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో ఉపాధి పనుల లక్ష్యం నెరవేరుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. మరో ఆరు రోజుల్లో మండలంలో 20 వేల పనిదినాలు పూర్తి చేయాల్సి ఉంది. బకాయిలపై వివరణ కోరగా, మండలంలోని ఉపాధి కూలీలకు సుమారు రూ.80 లక్షల వేతనాలు రావాల్సి ఉందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమంత్ కుమార్ తెలిపారు.

క్షయపై అవగాహన పెంచుకోవాలి

కైకలూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్


కైకలూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కైకలూరు/ కలిదిండి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని ముందుగా గుర్తిస్తే త్వరితగతిన నివారించవచ్చని కైకలూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా కైకలూరు టీబీ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ విముక్తి భారత్ కింద కైకలూరు టీబీ యూనిట్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. టీబీ పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలని రెండు వారాల పాటు దగ్గు, జ్వరం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే కైకలూరు ప్రభు త్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయిం చుకోవాల న్నారు. వ్యాధి నివారణ కోసం క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగికి పోషణ నిమిత్తం ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి అందించడమే గాక మందులను ఉచితంగా ఇస్తారన్నారు. సీతనపల్లి, కొల్లేటికోట వైద్యులు కిరణ్, అన్నపూర్ణ, శ్వేత, ప్రసన్న, టీబీ యూనిట్ అధికారి వినయ్‌కుమార్, సూపర్‌వైజర్లు తాతారావు, శ్రీనివాసరావు, లక్ష్మీకుమారి, సీహెచ్ కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు. కలిదిండి పీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి అన్నారు. మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


ఎంపీడీవోకి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎంపీడీవోకు సచివాలయ ఉద్యోగుల వినతి

మండవల్లి మార్చి 24(ఆంధ్రజ్యోతి): గ్రామసచివాలయ ఉద్యోగులకు సర్వేల పని భారం పెరిగి పోయిందని పని భారం తగ్గించాలని మండవల్లి మండల సచివాలయ కార్యదర్శులు ఎంపీడీవోకి సోమవారం వినతిపత్రం అందించారు. ఏకకాలంలో వివిధ సర్వేలు పూర్తిచేయాలని సచివాలయ ఉద్యోగులను అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. సర్వేలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం వల్ల అనేకచోట్ల ఉద్యోగులకు సహకరించడం లేదని పేర్కొన్నారు. 8 నెలలుగా 14 రకాల సర్వేలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారని తెలిపారు. సమయం తక్కువ ఉండడంతో సెలవు రోజుల్లో కూడా పనిచేయాలని అధికారులు ఆదేశాలతో ఉద్యోగులు మానసిక వేదనకు గరవుతున్నారని వాపోయారు. సీనియర్ కార్యదర్శులు కె.ప్రభాకరరావు, ఎం.కొండలు, సచివాలయం కార్యదర్శులు ఘంటసాల రామ, చైతన్య, శ్రావణ్, డి.నాగరాజు, బి.జక్రయ్య, శ్రీనివాస్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ లెక్కల పరీక్ష ప్రశాంతం


కలిదిండి /ముదినేపల్లి/చాట్రాయి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలం కలిదిండి, కోరుకొల్లు, ఆరుతెగలపాడు, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాల్లో సోమ వారం నిర్వహించిన లెక్కల పరీక్షకు 10 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలి పారు. మొత్తం 836 మంది విద్యార్థులకు 826 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. సమ స్యాత్మకమైన కోరుకొల్లు పరీక్షా కేంద్రాన్ని తహసీ ల్దార్ రామకృష్ణ సందర్శించి పరిశీలించారు. ముదినేపల్లి మండలంలో 98.5 శాతం విద్యార్థులు హాజరు నమోదైంది. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 668 మంది హాజరు కావాల్సి ఉండగా, 658 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరైనట్లు ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. ముదినేపల్లిలోని సహాయ మాతా హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని లింగవరం మండల విద్యాశాఖాధికారి రవీంద్ర నేతృత్వంలోని స్క్వాడ్ తనిఖీ చేసింది. చాట్రాయి మం డలం చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేం ద్రంలో 280 మందికి 279 మంది, ఆర్సీఎం స్కూల్ పరీక్షా కేంద్రంలో 166 మందికి గాను 157 మంది హాజరయ్యారని, 9 మంది గైర్హాజరు అయ్యారని ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు.


కోరుకొల్లు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ


చాట్రాయిలో పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేస్తున్న డైరెక్టర్

వధూవరులకు బంగారు నాణేలు అందజేత

చాట్రాయి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న ఓరుగంటి నాగేశ్వరరావు కుమారుడు మరళీకృష్ణ, మంకొల్లు పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న జి.శ్రీనివాసరావు కుమార్తె తిరుమల వివాహాలు సందర్భంగా బంగారు నాణేలు అందించారు. కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకంలో ఒక్కొక్కరికి రూ 20 వేలు విలువైన బంగారు నాణేలను సోమవారం సంస్థ డైరక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. కార్యక్రమంలో సంఘాల అధ్యక్షులు శీర్లం పుల్లారెడ్డి, ఇమ్మడి శ్రీనివాసరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.


హెచ్ఎంకు కంప్యూటర్లు, సామగ్రి అందజేస్తున్న జోనల్ మేనేజర్ సంపత్

పాఠశాలకు కంప్యూటర్లు, బీరువాలు వితరణ

ముసునూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం జడ్పీపాఠశాలకు అడ్వాంట సీడ్స్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో రూ 2లక్షలు విలువైన కంప్యూటర్లు, బీరువాలు, ఇతర సామగ్రి సోమవారం అందజేశారు. కంపెనీ జోనల్ మేనేజర్ సంపత్ మూడు కంప్యూటర్లు, మూడు బీరువాలు, నాలుగు టేబుల్స్, 8 కుర్చీలును పాఠశాల హెచ్ఎం నారాయణరావుకు అందజేశారు. కంపెనీ ఉద్యోగులు ఏ.రాజు, సీహెచ్.మధుమోహన్, జి.నర్సిరెడ్డి, మణికంఠ, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

తాగునీటి సమస్య తలెత్తకూడదు

మునిసిపల్ సమావేశంలో అధికారులకు మంత్రి కొలుసు ఆదేశాలు

నూజివీడు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు చేపట్టండి.. నిధులు అవసరమైతే సహకరిస్తాను.. అంటూ మంత్రి కొలుసు పార్థసారథి మునిసిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నూజివీడు మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన సోమవారం బడ్జెట్ సమావేశం జరిగింది. వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ కొమ్మని విజయ పట్టణంలో తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్య సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల వాటర్ పైప్‌లైన్లు వేయడంతో పాటు ట్యాంక్‌లు ఏర్పాటు చేయాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. తన సొంత నిధులతో ట్యాంకర్లు కొనుగోలు చేసి మునిసిపాలిటీకి అందిస్తానన్నారు. మునిసిపాలిటీలో గత పదేళ్ల నీటి పన్ను వసూలు చేయకుండా ఇప్పుడు తక్షణం చెల్లించాలని లేకపోతే తాగునీటి కుళాయిలను డమ్మీ చేస్తామంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి స్పందిస్తూ వాటర్ ట్యాక్స్‌పై కొంత సమయం ఇవ్వాలని, తాగునీరు సరఫరా కాని వారి బిల్లులను రెక్టిఫై చేస్తూ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలని మునిసిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఇతర అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి సారథి

రూ.10.57 కోట్ల మిగులు బడ్జెట్ ఆమోదం :

రూ.10.57 కోట్ల మిగులుతో మునిసిపల్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది. రూ.8,02,58,756 ప్రారంభ నిల్వతో సాధారణ ఆదాయం రూ.17.23 కోట్లు వచ్చే అవకాశం ఉందని, కాపిటల్ ఆదాయం రూ.35.17 కోట్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రూ.15.17 కోట్లు సాధారణ ఖర్చులు, రూ.34.85 కోట్లు క్యాపిటల్ ఖర్చు బడ్జెట్లో ప్రతిపాదించారు.

మందులతో క్షయ వ్యాధి నుంచి విముక్తి

నూజివీడు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్ అన్నారు. ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని బాధితులకు ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేశారు. క్రమం తప్పకుండా మందులను తీసుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కందిపప్పు, బెల్లం తదితరాలతో కూడిన ఫుడ్ బాస్కెట్స్ పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీబీ క్లినిక్ వైద్యాధికారి ఎ.దుర్గాభవాని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


లబ్దిదారులకు ఫ్రూట్ బాస్కెట్స్ అందిస్తున్న దృశ్యం

సారా తయారీదారులపై కఠిన చర్యలు

నూజివీడు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీ విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ హెచ్ అజయ్‌కుమార్ సింగ్ హెచ్చరించారు. ఓగిరాల తండాలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సారా తయారీ, రవాణా వివరాలను ఎక్సైజ్ అధికారులకు అందించాలన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పోతనపల్లిలో 50 లీటర్లు సారా స్వాధీనం

చాట్రాయి :పోతనపల్లి చిన్న తండాలో సోమవారం జరిపిన దాడిలో 1,100 లీటర్లు బె ల్లం ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. పరారైన ధరావతు శంకర్‌పై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు


చాగంటిని సత్కరిస్తున్న దృశ్యం

మండవల్లి సిద్ధాంతి చాగంటికి సత్కారం

మండవల్లి మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండవల్లికి చెందిన సిద్ధాంతి చాగంటి శ్రీనివాస్‌ను హైదరాబాద్ విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన్ సంస్థ జ్యోతి మిత్ర బిరుదుతో సత్కరించింది. విజయవాడలోని గోల్డెన్‌వేలో ఆదివారం జ్యోతిష్య సమ్మేళనం నిర్వహించారు. 2025 ఉగాది పురస్కారం కింద చాగంటిని సత్కరించి మెమెంటో అందజేశారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

ముదినేపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పేరూరులో ఓ మహిళను వేధిస్తున్న సతీష్ అనే యువకుడిపై సోమవారం ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

పెదపాలపర్రుకు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. ఘంటసాల మండలం పెద గూడెంకు చెందిన ఆ మహిళతో పెద పాలపర్రుకు చెందిన ఓ వ్యక్తితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల వారిద్దరి మధ్య విబేధాలు తలెత్తాయి. ఈనెల 23 రాత్రి ఆమె భర్త గుడివాడ వెళ్లగా అతను తిరిగి వచ్చే సరికి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.


సీఎం నిధి చెక్కు అందిస్తున్న టీడీపీ నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చాట్రాయి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. సూరంపాలెంకు చెందిన బలుసూరి భారతికి రూ.81 వేలు, గోకవరపు రూపకు రూ.31 వేలు మంజూరయ్యాయి. టీడీపీ నాయకులు నక్కా రాము, గుడిమళ్ల బ్రహ్మయ్య, దార్ల సురేష్, జయరాజు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు.

కోతుల దాడిలో ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

నూజివీడు టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కోతులు, కుక్కల దాడితో విద్యార్థులు తరచూ గాయపడుతున్నారు. సోమవారం కోతులు దాడి చేయడంతో తేజిక, తేజస్వి అనే ఇద్దరు విద్యార్థినులు గాయపడ్డారు. క్లాసల అనంతరం క్యాంపస్‌లోని హాస్టల్‌కు వెళుతుండగా వారిపై కోతులు దాడి చేశాయి. క్యాంపస్ ఆసుపత్రిలో సంబంధిత వైద్య సౌకర్యం లేకపోవడంతో వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. హాస్టల్‌కు వెళుతుండగా తరచు కోతులు దాడి చేస్తున్నాయని, హాస్టల్ బాత్‌రూమ్ వద్ద తిష్ఠ వేస్తున్నాయని ట్రిపుల్ ఐటీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కోతులను తోలే ప్రయత్నం చేసిన మహిళ సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేయడంతో వారు భయపడుతున్నారు.